వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శనివారం 05 ఏప్రిల్ 2025

## సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలి



లక్కిరెడ్డిపల్లె; ఏప్రిల్ 04, ప్రభాతవార్త

మండలంలోని సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సేవలను అందించాలని రాయచోటీ నియోజకవర్గ సిపిఐ నాయకులు సిద్ధిగాళ్ళ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పందిళ్ళపల్లె సచివాలయం సిబ్బంది మధ్యాహ్నం 12 గంటలు అయినా కూడా సచివాలయం తెరవకపోవడంతో గ్రామం నుండి వివిధ సమస్యలపై వచ్చిన ప్రజలు సిబ్బంది లేకపోవడంతో వెనతిరిగినట్లు తెలిపారు. మండల స్థాయి అధికారులు సచివాలయ సిబ్బంది పనితీరుపై ఆరా తీయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చు పెట్టి సచివాలయాలను నిర్మించి సిబ్బందిని నియమించారన్నారు. వేలకు వేల రూపాయలు జీతాలు తీసుకుంటూ కనీసం సమయపాలన పాటించకుండా ఇష్టానుసారం ప్రజలకు దుమ్మా కొట్టడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ విషయం జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సచివాలయ సిబ్బంది పనితీరుపై ఫిర్యాదు చేస్తానని అన్నారు.

## తాగునీరు వృథా.. పట్టించుకోని అధికారులు



సిద్దవటం, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:

తాగునీరు వృథాగా పోతున్నా సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారు. మండల కేంద్రమైన సిద్దవటం పెన్నానది నుంచి తాగునీరు, భాకరాపేట, మాధవరం, ఉప్పరపల్లె, పర్వతీపురం తదితర గ్రామాలకు వెళ్లే మంచినీటి ప్రధాన పైపులైను భాకరాపేట సచివాలయం వద్ద గత నెల నుంచి మంచినీటలి పైపు దెబ్బతినడంతో తాగునీరు వృథాగా పోతోంది. వేసవిలో మంచినీటి వృతా అరికట్టకపోతే ప్రజలకు ఇబ్బందులు తప్పవని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృథా నీటి సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గురుప్రసాద్‌ను వివరణ కోరగా సిద్దవటం పెన్నానది నుంచి తాగునీరు అందించే సంబంధిత కాంట్రాక్టర్ గడువు మార్చి 31తో ముగిసిందని నూతనంగా టెండర్లు పిలిచామని వృథాగా తాగునీరు పోకుండా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

# బాలికలపై పెరుగుతున్న లైంగిక దాడులు

: నిన్న లిటిల్‌ఫ్లవర్ పాఠశాల, నేడు ఏవీఆర్ పాఠశాల

: వికృత చేష్టలతో బాలికలను భయాందోళనకు గురిచేస్తున్న కామాంధులు

: చర్యలు తీసుకోవడంలో పోలీసులు విఫలం

: అర్హతలేనివారిని పాఠశాలకు ఎంపిక చేస్తున్న యాజమాన్యాలు

: వీటిలో కూడా రాజకీయాలు



బద్వేలు, ఏప్రిల్ 4, ప్రభాతవార్త :

బాలికలపై రోజురోజుకు పెరుగుతున్న లైంగిక దాడులను అరికట్టడంలో బద్వేలు పోలీసులు విఫలమవుతున్నారు. పాఠశాలలో అర్హత లేని వారిని ఎంపిక చేసుకుని యాజమాన్యం ఒక తప్పు చేస్తుంటే తప్పు చేసిన వారిని పూర్తిస్థాయిలో శిక్షించకుండా పోలీసులు నామమాత్ర చర్యలు చేపట్టడంతో ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట బాలికలపై దాడులు పెరిగిపోతున్నాయి. రెండు రోజులు గడవకముందే బద్వేలులో బాలికలపై దాడులు చేపట్టి సంచలనం సృష్టించారు. రెండు రోజుల క్రితం లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు అన్వర్ 4వ తరగతి విద్యార్థినిపై లైంగిక దాడి చేపట్టిన ఘటన మరువకముందే శుక్రవారం పట్టణంలోని ఏవీఆర్ పాఠశాలలో కంప్యూటర్ ఆపరేటర్ పెంచలయ్య అనే వ్యక్తి సదరు పాఠశాలలో 6వ తరగతి విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించడంతో బాలిక తల్లిదండ్రులు, బంధువులు పాఠశాలకు వెళ్లి పెంచలయ్యకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పచెప్పారు. లైంగిక దాడులకు పాల్పడిన వారిపై వీటిలో కూడా రాజకీయం చేసిఎలాంటి చర్యలు చేపట్టకుండా వారిని వదిలేయడంతో మరోచోట ఇలాంటి సంఘటనలు పునరావృతమవుతున్నాయి. పాఠశాలలో కామాంధులు రోజురోజుకు పెరిగి చిన్న పిల్లలని కూడా చూడకుండా కామంతో చూస్తూ వారిని ఏదో విధంగా లైంగిక దాడి చేయాలని మనసులో అనుకుని చేస్తున్న వారికి తల్లిదండ్రులు గుణపాఠం చెబుతున్నా పోలీసులు మాత్రం చట్టపరమైన చర్యలు అంటూ వారికి రాచమర్యాదలు చేస్తున్నారు. దీని వలన లైంగిక దాడులు పెరిగిపోతున్నట్లు పట్టణ ప్రజలు మండిపడుతున్నారు. వికృత చేష్టలతో పాఠశాలలకు వెళ్లే చిన్న పిల్లలపై ఇలాంటి కామాంధుల కళ్లుపడడం వలన తల్లిదండ్రులు పాఠశాలకు పంపాలంటేనే భయపడుతున్నారు. యాజమాన్యాలు మాత్రం అర్హత లేనివారిని పాఠశాలలోకి తీసుకుని వారికి బాద్యతలు అప్పచెప్పడం వారు ఇష్టానుసారంగా వ్యవహరించడం జరుగుతుంది. అలా అని పాఠశాలపై విద్యాశాఖ కూడా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. బాలికలపై జరిగిన లైంగిక దాడులపై అనేక చట్టాలు ఇతర రాష్ట్రాలలో భయాందోళనలకు గురిచేస్తుంటే మన ప్రాంతంలో నామమాత్రంగా చర్యలు తీసుకోవడం వలన మరొకరు ఇలాంటి వాటికి పాల్పడేందుకు దోహదపడుతున్నారు. ఒక తప్పు చేస్తే మరో తప్పు చేయాలంటే భయపడే విధంగా పోలీసులు చర్యలు తీసుకుంటూ చట్టాల ఉంటే ఇక్కడ ఒక తప్పు చేసినా మరో తప్పు ఏమి కాదన్నట్లుగా కామాంధుల వికృత చేష్టలతో బాలికల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. మన సమాజం ఎటుపోతుందోనని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఈ మధ్య కాలంలో ప్రైవేటు పాఠశాలలో విద్యాబోధన చేసేవారు వయసుకు తగిన విధంగా వ్యవహరించడంలో విఫలమవుతున్నారు. యాజమాన్యాలు తగిన చర్యలు తీసుకుని పాఠశాలకు వచ్చే ఉపాధ్యాయులు క్రమశిక్షణతో ఉండాలని చెప్పడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. అనేక చోట్ల ఉపాధ్యాయులు విద్యాబోధనలు బోధించడం కన్నా కామంతో చూస్తూ చిన్న పిల్లలపై వ్యవహరిస్తున్న తీరుపై యాజమాన్యాలు వెంటనే చర్యలు తీసుకుంటే తప్ప వారు కూడా చూసి చూడనట్లు వ్యవహరించడం తర్వాత పిల్లలు తల్లిదండ్రులకు చెప్పుకోలేకపోవడం లాంటి సంఘటనలు కొకొల్లలుగా ఉన్నాయి. వీటిని అరికట్టాలంటే తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షిస్తే మరొకరు ఇలా చేయరని తల్లిదండ్రులు తెలుపుతున్నారు.

### కామాంధులపై కఠిన చర్యలు తీసుకోవాలి:



బద్వేలులో రెండు రోజులలో వివిధ ప్రైవేటు పాఠశాలలో బాలికలపై ఉపాధ్యాయులు వికృత చేష్టలకు పాల్పడడం సభ్యసమాజం తలదించుకునేలా ఉందని, ఇలాంటి కామాంధులపై కటిన చర్యలు తీసుకోవాలి. అభం శుభం తెలియని బాలికలు పాఠశాలకు వెళితే విద్యాబోధనలు చెప్పాల్సిన ఉపాధ్యాయులు వారిని కామంతో చూస్తూ ఇబ్బందులు పెడితే తల్లిదండ్రులకు చెప్పుకోలేని దుస్థితిలో వారు ఏడుస్తూ వారి బాధను వినిపిస్తున్నారు. అయితే యాజమాన్యాలు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఎవరిని పడితే వారిని పాఠశాలలో తీసుకుని విద్యాబోధనలు చెప్పించుకోవడం వలన ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. ఇటు పోలీసులు, అటు విద్యాశాఖ కఠినమైన చర్యలు తీసుకోవాలి.

చంద్రశేఖర్, సీపీఐఎంఎల్ జిల్లా పార్టీ నాయకులు, బద్వేలు

### అర్హత ఉన్న వారిని పాఠశాలలు ఎంపిక చేయాలి:



ఆయా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం అర్హత ఉన్న వారిని మాత్రమే పాఠశాలకు ఎంపిక చేసుకుని విద్యాబోధనలు చేయించుకోవాలి తప్ప, అర్హత లేని వారిని తీసుకోవడం వలన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. అలాగే పాఠశాల ఆవరణ, తరగతి గదులలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటే మరొకరు ఇలాంటి వాటికి పాల్పడేందుకు సాహసం చేయరు

మానుగుంట రవిశంకర్, డి పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు, బద్వేలు

## భూ సేకరణ పనులను
# త్వరితగతిన పూర్తిచేయాలి

కడప, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:




జాతీయ రహదారుల విస్తరణ, సోలార్ పార్కుల ఏర్పాటు కోసం చేపట్టిన భూసేకరణ, అటవీ, పర్యావరణ అభ్యంతరాలు, లీగల్ క్లియరెన్స్ ప్రక్రియలను పెండింగ్ లేకుండా. త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబందిత అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల విస్తరణ కోసం చేపట్టిన భూ సేకరణ ప్రక్రియ పెండెన్సీ పై శుక్రవారం కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జేసీ అదితి సింగ్, డిఎఫ్ఓ వినీత్ కుమార్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబందిత తహశీలర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో రవాణా వ్యవస్థను మరింత సులభతరం చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయన్నారు. అందులో భాగంగా బెంగుళూరు కడప విజయవాడ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూసేకరణ చేపట్టడం జరుగుతోందన్నారు. అందుకు సంబంధించి జిల్లా పరిధిలో ప్రభుత్వ, ప్రయివేటు, అటవీ శాఖకు చెందిన పలు భూములను కొనుగోలు చేసి భూములు కోల్పోయినవారికి పరిహారం కూడా ఇవ్వడం జరుగుతోందన్నారు. జాతీయ రహదారులు, రైల్వే లైన్ల నిర్మాణం, వాటి అభివృద్ధికి అదనంగా చేపడుతున్న భూసేకరణ పనులను వేగవంతం చేయడం జరుగుతోందన్నారు. అలాగే జిల్లాలో ఏర్పాటు చేస్తున్న మూడు రకాలైన సోలార్ అనుబంధ పవర్ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను, ఇతర అనుమతులను క్లియర్ వెంటనే.క్లియర్ చేయాలన్నారు. రోడ్డు విస్తరణ, నెడ్ క్యాప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎనర్జీ ప్రాజెక్టు పనులకు సంబంధించిన ప్రతిపాధనలు, అనుమతులకు సంబంధించిన ఫైళ్లను రెవెన్యూ అధికారులు వేగవంతం చేయాలన్నారు. ఈ ప్రక్రియలో ఎదురయ్యే ఫారెస్ట్, పర్యావరణ అభ్యంతరాలు, సవాళ్లు, కోర్టు కేసులు సంబందిత అంశాలను దాదాపుగా అధిగమించామన్నారు. కాగా ఇంకా ఇంకనూ పెండింగ్ లోవున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లాలో జరుగుతున్న జాతీయ రహదారుల అభివృద్ధి పనులు, భూసేకరణ పనులకు సంబందించి ఇప్పటికే రిలీజ్ చేసిన అవార్డు వివరాల గురించి సంబందిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు, పులివెందుల ఆర్డీవోలు సాయిశ్రీ, చిన్నయ్య, ఎన్ హెచ్ఏఐ ఎస్డీసి వెంకటపతి, పీడి అశోక్ కుమార్, డిప్యూటీ మేనేజర్లు వేణుగోపాల్, సుదర్శన్ కుమార్, ఆర్‌బి నేషనల్ హైవే ఈఈ విజయ్ భాస్కర్ రెడ్డి, నెడ్ క్యాప్ జిల్లా అభివృద్ధి అధికారి ఎల్లారెడ్డి, వివిధ సోలార్ పవర్ ప్రాజెక్టుల ప్రనిధులు, ఫారెస్ట్, భూసేకరణ, రెవెన్యూ శాఖల ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షాలు నేలకొరిగిన అరటి తోటలు

### వడగండ్లు, గాలులతో కూడిన వర్షలకు అరటి అతలాకుతలం

### ఆత్మహత్యలే శరణ్యమంటున్న రైతులు





కాశినాయన, ఏప్రిల్ 4, ప్రభాతవార్త

గురువారం రాత్రి ఆకస్మికంగా కురిసిన అకాల వడగండ్లు గాలులతో కూడిన వర్షాలకు వందలాది ఎకరాలలో అరటి తోటలు నేలమట్టమయ్యాయి. వివరాలలోకి వెళితే కడప జిల్లా అవధూత కాశి నాయన మండలం లోని సావి శెట్టి పల్లి గ్రామంలో రైతులు సుమారు వెయ్యి ఎకరాలు అరటి తోటలు సాగు చేశారు. గురువారం రాత్రి కురిసిన వర్షాలకు చేతికొచ్చిన పంట పూర్తిగా నేలమట్టమయ్యాయి. దీంతో ఆ గ్రామంలోని రైతులు లబోదిబో అంటున్నారు. కోతకు వచ్చిన ఈ దిశలో పంట పూర్తిగా నేలపాలు కావడంతో రైతుల బాధలు వర్ణనాతీతం చంద్ర ఓబుల రెడ్డి అనే ఓ రైతుకంగా 14 ఎకరాల లో అరటి పంటను సాగు చేసి సుమారు 20 లక్షల పైగా పెట్టుబడి పెట్టాడని ఇప్పుడు పంట పూర్తిగా నేలపాలు అయిందని ఆ రైతు గోడును వెళ్ళబోసుకున్నాడు. రెండు రోజులు వర్షాలు రాకుండా ఉండి ఉంటే తను పెట్టిన పెట్టుబడిన వచ్చేదని ఇప్పుడు ఏమి చేయాలని అప్పులు చేసి సాగు చేసిన పంట చేతికి రాక నేలపాలు కావడంతో ఆ రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .అప్పు ఇచ్చినవారు తమ అప్పులు వడ్డీలతో సహా కట్టమని వెంటపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీరా చూస్తే నోటికి వచ్చిన ఈ పంట నేడో రేపో కోతలు కోసి చేసిన అప్పులు తీర్చుకోవచ్చని ఆనందంగా ఉన్న ఆ రైతు రాత్రి కురిసిన ఆకాల వర్షాల కారణంగా పూర్తిగా నష్టపోయారు. నష్టపోయిన అటు ప్రభుత్వ అధికారులు ఇటు పాలకపక్ష నాయకులు స్పందించి ఆదుకోవాలని రైతుల విజ్ఞప్తి చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులను గుర్తించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు. చేసిన అప్పులు తీర్చలేక చేతికి వచ్చిన పంటలు నేల పగలు కావడంతో మాకు ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ప్లేవుడ్‌ను పక్కదారి పట్టించిన వ్యక్తులు అరెస్టు

### :రూ. 5లక్షల విలువైన ప్లేవుడ్ స్వాధీనం : ఇరువురి అరెస్టు



బద్వేలు , ఏప్రిల్ 4 (ప్రభాతవార్త) :

బద్వేలు సెంచరి ప్లేవుడ్ నుంచి కలకత్తాకు రవాణా చేయవలసిన ప్లేవుడ్‌ను పక్కదారి పట్టించిన విషయంపై ఇరువురిని బద్వేలు రూరల్ సీఐ నాగభూషణం అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఈ సంఘటనపై రూరల్ సీఐ నాగభూషణం సర్కిల్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ సెంచరీ ప్లైవుడ్ ఫ్యాక్టరీ నుంచి ఫైస్ లాజిస్టిక్ ట్రాన్స్‌పోర్టు కంపెనీ తరపున కలకత్తాకు ప్లేవుడ్ సప్లై చేసేందుకు నకిలీ లారీ పత్రాలతో సీతారామాపురం గ్రామానికి చెందిన మహేష్ అనే వ్యక్తి నెల్లూరుకు చెందిన శివకుమార్ సాయంతో ప్లేవుడ్‌ను పక్కదారి పట్టించారు. ఆకుల మహేష నకిలీ పత్రాలతో లారీని తీసుకెళ్లి ఎవరికీ అనుమానం రాకుండా ఫ్యాక్టరీలోకి వెళ్లి రూ.5లక్షల విలువైన ప్లేవుడ్‌ను లోడ్ చేసుకుని బయటకు రాగానే నంబరు ప్లేటు మార్చి నెల్లూరుకు తీసుకెళ్లి అక్కడ ప్లేవుడ్‌ను శివకుమార్ సాయంతో రూములో భద్రపరిచి లారీని అక్కడే వదిలేసి రాజమండ్రి వరకు సెల్‌ఫోన్ తీసుకుని వెళ్లాడు. అక్కడ సెల్‌స్విచ్ ఆఫ్ చేసి అందుబాటులోకి రాకపోవడంతో కలకత్తాకు చెందిన వారు లాజిస్టిక్ ట్రాన్స్‌ఫోర్టు కంపెనీని సంప్రదించి సరుకు రాలేదని చెప్పడంతో ఇక్కడ ఉన్న కంపెనీవారు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన ఆకుల మహేష్, శివకుమార్‌లు పథకం ప్రకారం ప్లైవుడ్‌ను పక్కదారి పట్టించిన విషయం తెలిసిందని, వీరిపై కేసు నమోదుచేసి వారి వద్ద ఉన్న ప్లైవుడ్‌ను సీజ్ చేయడం జరిగిందని బి.కోడూరు ఎస్ఐ రాజు, పోలీసు సిబ్బంది సహకారంతో కేసును చేదించడం జరిగిందని సీఐ తెలిపారు.

## కాలుష్య రహిత నగరాల్లో కడపకు ప్రథమ స్థానం..

కడప కార్పొరేషన్ ఏప్రిల్ 4 ప్రభాతవార్త:



కాలుష్యరహిత నగ రాల్లో కడపకు రాష్ట్రంలోనే మొదటిస్థానం దక్కిందని కడప నగరపాలక సంస్థ డాక్టర్.మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ఎం. చంద్రశేఖర్ తెలిపారు. కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ నిర్దేశించిన ప్రమాణాల్లో 2023, 24 సంవత్సరానికి కడపలో ఉత్తమ గణాంకాలు నమోద య్యాయి. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం కింద కేంద్ర ప్రభుత్వం ఏటా ఫలితాలు ప్రకటిస్తుంది. పథకం కింద నగర పరిధిలో వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రణాళిక రూపొందించుకుని కార్యాచరణ చేపడతారన్నారు. గాలిలో కాలుష్యకారకాల స్థాయిని గుర్తించడానికి కాలుష్య నియంత్రణ మండలి రైల్వే స్టేషన్ రోడ్డులోని కార్పొరేషన్ కాంప్లెక్స్ పై డిజిటల్ బోర్డు ఏర్పాటు చేసింది. గాలిలోని కాలుష్యకారకాల పరిమాణం దీని ద్వారా తెలుసుకోవచ్చుమని చెప్పారు. గాలిలో ఖిప ర్టిక్యులేట్ మ్యాటర్ (పీఎం)ఖి పరిమాణం ఇక్కడ కీలకంగా ఉంటుంది. కడపలో నిర్దేశిత ప్రమాణాలకు లోబడి 10 పీఎం స్థాయిలో 42 పాయింట్లు వచ్చాయని వెల్లడించారు. 60 పాయింట్ల లోపు వస్తే ఆ ప్రాంతం కాలుష్యరహితంగా ఉన్నట్లు లెక్క. క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం కింద కేంద్ర ప్రభుత్వం నగరపాలక సం స్థకు దాదాపు రూ.6 కోట్ల నిధులను గతంలో మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని గాలి నాణ్యతను పెం పొందించే కార్యక్రమాలకు ఖర్చు చేశారు. ప్రధాన రహదారుల వెంట స్వీపింగ్ యంత్రాల త్వారా దుమ్ము ధూళిని తొలగిస్తున్నామని వివరించారు. కాలువల నుంచి తీసిన పూడికను, భవననిర్మాణ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలిస్తున్నామని తెలిపారు. కాలుష్య కారకాలను వెదజల్లే పరిశ్రమలపై నిఘా ఉంచి తగిన చర్యలు తీసుకున్నామన్నారు. నగ రంలోని వివిధ ప్రాంతాల్లో మొక్కల పెంపకం, పార్కుల ఏర్పాటుతో స్వచ్ఛత మెరుగైందిని తెలిపారు.

## ప్రమాదాల మలుపు.. తరచూ ప్రమాదాలు

### - పట్టించుకోని రోడ్లు భవనాల శాఖ



సిద్దవటం, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:

కడప-బద్వేలు రహదారి ప్రమాదాలకు నిలయంగా మారి పలువురికి రోడ్డు ప్రమాదాలు జరిగి చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతున్న ఘటనలున్నాయి. కడప-బద్వేలు ప్రధాన రహదారి క్రాసింగ్ మలుపు వద్ద రోడ్డు పనులు చేయక ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. మండల కేంద్రమైన సిద్దవటం, కడప ప్రధాన రహదారి రోడ్డు విస్తరణ పనుల్లో ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యధోరణి వల్ల ప్రమాదాలకు నిలయంగా చోటు చేసుకుంటోంది. గత వైసీపీ పాలనలో రోడ్డు విస్తరణ పనులు నత్త నడకన కొనసాగి కొంత వరకు పనులు జరిగి అర్ధంతరంగా పనులు నిలిచిపోగా రోడ్డుకు ఇరువైపులా రహదారి విస్తరణలో భాగంగా వైసీపీ ప్రభుత్వంలో పనులు చేసి కంకర పరిచారు తప్ప ఎటువంటి రహదారి చూపట్టక మలుపు వద్ద నరపమాదాలు చోటు చేసుకున్నాయి. రాత్రి వేళల్లో పల్లె ప్రాంతాల ప్రజలు రహదారి గుంతలమయం కావడంతో ద్విచక్ర వాహనంలో వెళ్తూ ఎంతో మంది గాయాలు తగిలి అవస్థలు పడ్డారు. మార్చి 31న సంటిగారిపల్లె గ్రామానికి చెందిన ప్రదీప్‌కుమార్‌రెడ్డి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా మలుపు వద్ద ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొనడంతో బలమైన గాయాలు తగిలి కడప నగరంలో ప్రైవేటు వైద్యశాలలో వైద్యం తీసుకుంటూ కొట్టుమిట్టాడుతున్నాడు. ఇంత జరుగుతున్నా ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డు పనులు చేయక నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రమాదాలు అరికట్టేందుకు మలుపు వద్ద రహదారి పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## ఐదవ తరగతి వరకు పాఠశాల కొనసాగించాలి

బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 4ప్రభాతవార్త:



మండలం లోని సోమిరెడ్డి పల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని నరసన్నపల్లె గ్రామస్తులు శుక్రవారం ఎంఈఓ2 ను కలిసి నరసన్న పల్లె గ్రామంలో ఉన్న ఎంపీపీ పాఠశాలలో ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు కొనసాగించాలని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాగ్రామంలో పాఠశాల ఏర్పడినప్పటి నుండి ఐదవ తరగతి వరకు కొనసాగిస్తూ ఉన్నారని అయితే గత ప్రభుత్వంలో మూడు, నాలుగు, ఐదు తరగతులను ఒకటిన్నర కిలోమీటర్ దూరంలో ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్ కు మార్చడంతో చిన్నపిల్లలు, వికలాంగుల పిల్లలు చాలా ఇబ్బందులకు గురయ్యారని ఈ నిర్ణయాన్ని మార్చుకోవాలని గతంలో పలుమార్లు నిరసన కార్యక్రమాలు తెలియజేసినప్పటికీ ఫలితం లేదని వాపోయారు. ప్రస్తుత ప్రభుత్వంలో నూతన విద్య విధానంలో భాగంగా విద్యార్థుల సంఖ్య ఉన్న పాఠశాలను ఆదర్శ పాఠశాలకు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ మా గ్రామంలో గతంలో ఉన్న మాదిరిగా ఐదవ తరగతి వరకు కొనసాగించాలని వారు కోరారు.ఈ సమస్యపై ఎమ్మెల్యే పట్టా సుధాకర్ యాదవ్, జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని,ఈ పాఠశాలకు పూర్వ వైభవం తీసుకురావాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు చెంద్రాయుడు, గంగయ్య, ఓబులేసు,చలపతి, నారాయణ యాదవ్, డి సుబ్బయ్య యాదవ్, జయరాం,బాల గురవయ్య, రామయ్య, విజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఎంఈఓ వివరణ ఈ సమస్యలో పై అధికారులు దృష్టికి తీసుకెళ్తామన్నారు.

## ఫార్మసీ పరిశ్రమలో ప్రతి విద్యార్థి
# ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలి

### అన్నమాచార్య యూనివర్సిటీ ఛాన్స్ లర్ సి.గంగిరెడ్డి

రాజంపేట అర్బన్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త

ఫార్మసీ రంగంలో ప్రతి విద్యార్థికి ఉపాధి అవకాశాలు ఉంటాయని, అయితే ఈ పరిశ్రమలో తమ కంటూ ప్రతి విద్యార్థి ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే విధంగా ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నమాచార్య విశ్వవిద్యాలయం ఛాన్స్ లర్ చొప్పా గంగిరెడ్డి అన్నారు. స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో శుక్రవారం మూడవ సంవత్సరం బి ఫార్మసీ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు నాలుగో సంవత్సరం బి ఫార్మసీ విద్యార్థులకు వీడ్కోలు ఉత్సవాల కార్యక్రమం నిర్వహించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న గంగిరెడ్డి మాట్లాడుతూ విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులు అందరినీ అభినందిస్తూ తమ పై చదువులు పూర్తి చేయాలని కోరారు.అన్నమాచార్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ డాక్టర్ ఈ.సాయి బాబా రెడ్డి మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన క్యాంపస్ నియామకాల లో ఉద్యోగాలను సంపాదించిన విద్యార్థులు అందరినీ అభినందిస్తూ తమ ఉద్యోగంలో కెరీర్ కు ముఖ్యమైన అంశాలపై వివరించారు. కళాశాల వైస్ చైర్మన్ శ్రీ సి ఎల్లారెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులు పలు దేశాలలో ఎన్నో రంగాల్లో సేవలు అందిస్తున్నారని కళాశాల పునాదిరాయిగా క్రమశిక్షణ అందుకు ముఖ్యమైన భాగం అన్నారు. ప్రస్తుతం విద్య పూర్తికానున్న విద్యార్థులు కూడా భవిష్యత్తులో గొప్ప స్థాయికి ఎదగాలని కోరారు.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ స్వర్ణలత బి ఫార్మసీ విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులు అందరినీ వారి యొక్క విద్యార్హత , ఉన్నత విద్య భవిష్యత్తు సఫలం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలతో , గుర్తింపు చిహ్నాలతో ఎంతో ఆనందంగా జరిపారు.విద్యార్థులు కూడా తమకు తమ కళాశాలతో ఉన్న అనుబంధాన్ని తమకు అధ్యాపక బృందం పట్ల ఉన్న గౌరవాన్ని వారు చేసిన సహాయాన్ని తమ తోటి విద్యార్థులతో ఉన్న బంధాన్ని గుర్తు తెచ్చుకున్నారు.



## రైతు సేవ కేంద్రం సిబ్బందికి సమీక్ష సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

**పీలేరు ఏప్రిల్ 4 ప్రభాతవార్త ;**
పీలేరు ఎంపీడీవో కార్యాలయంలో పీలేరు, కే.వీ.పల్లి, కలకడ మండల రైతు సేవ కేంద్రం సిబ్బందికి సమీక్ష సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రాయచోటి శ్రీ బి.చంద్ర నాయక్ రైతులకు 50 రాయితీపై పవర్ స్ప్రేయర్ అందజేశారు. అలాగే రైతు విశిష్ట సంఖ్య ప్రాముఖ్యతను వివరించారు. రైతు సేవ కేంద్రం సిబ్బంది అందరూ రైతులకు విశిష్ట సంఖ్య గురించి వివరించి రైతులందరికీ కచ్చితంగా రిజిస్ట్రేషన్ చేయాలని లేకపోతే వారికి పీఎం కిసాన్ గాని, ఏ ప్రభుత్వ పథకం కానీ వర్తించదని తెలియజేసి రైతులను రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. అలాగే వ్యవసాయ శాఖలో ఉన్న వివిధ పథకాల గురించి సమీక్షించి వారికి తగిన సూచనలను చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు వై.వి రమణ రావు, జిల్లా వ్యవసాయ కార్యాలయ ఎ.ఓ రమేష్ రాజు, టెక్నికల్ ఏవో కరుణాకర్ రెడ్డి, కేవీ పల్లి ఏ.ఓ శ్రావణి, కలకడ ఏ.ఓ లావణ్య, ఏఈఓలు జోష్ణ, ఇంద్ర, నజీర్ రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభించిన తహసిల్దార్




**బద్వేల్ అర్బన్, ఏప్రిల్ 4, ప్రభాత వార్త**
బద్వేలు తహసిల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం మంచి నీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. అనంతరం తహసిల్దార్ ఉదయ్ భాస్కర్ రాజు మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని చల్లని మంచినీటిని ఏర్పాటు చేయడం జరిగిందని ,నాకు ఎంతో సంతోషంగా ఉందని, ఇక్కడ తహసిల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, ఆర్డీవో కార్యాలయం, మరియు ఎంపీడీవో కార్యాలయం, ఉండడం వలన అనేకమంది ప్రజలు చుట్టుపక్కల గ్రామాల నుండి వారి వారి అవసరాల నిమిత్తం వందల మంది వస్తుంటారని, ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో ప్రజల దాహన్ని తీర్చడమే కాకుండా, వడదెబ్బ తగలకుండా మంచి నీరు ఎక్కువగా తీసుకోవాలని ఎండ ఉన్న ప్రాంతాలలో ఎక్కువసేపు ఉండకూడదని వారు తెలియజేశారు.

## అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**కాశినాయన, ఏప్రిల్ 4, ప్రభాతవార్త**



బద్వేలు నియోజకవర్గంలో గురువారం రాత్రి కురిసిన అకాల వడగండ్లు గాలులతో కూడిన వర్షాలకు వందలాది ఎకరాలలో అరటి తోటలు నేల మట్టమయ్యాయి. మరియు పొగాకు పంటలు తడిసి ముద్దయ్యాయ నీ నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్సీ డీ సీ గోవింద రెడ్డి డిమాండ్ చేశారు. అలాగే సజ్జలుమరియు వరి ఇతర పంటలతో కూడా నష్టపోయిన రైతులు, చేతకొచ్చిన పంటలు పూర్తిగా నేలమట్టమయ్యాయి దీంతో కోతకు వచ్చిన ఆ దశలో నేల పాలు కావడంతో రైతుల బాధలు వర్ణనాతీతం ఉంది సుమారుగా పంటలు ఖర్చులు సుమారుగా లక్షల పైగా పెట్టుబడి పెట్టదాని ఇప్పుడు పంట పూర్తిగా నేలపాలు అయిందని ఎమ్మెల్సీ తెలియజేశారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం స్పందించి అధికారుల ద్వారా ఒక ప్రణాళిక తయారు చేసి పంట నష్టపోయిన రైతులకు ఇన్పుట్ సబ్సిడీతో పాటు ఇన్సూరెన్స్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## ప్రజలకు మజ్జిగ వితరణ అభినందనీయం



**బద్వేల్ అర్బన్ ఏప్రియల్ 04 ప్రభాతవార్త :**
వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఎస్ కే బి బ్రాయిలర్ చికెన్ సెంటర్ సయ్యద్ మోలాలి సహకారంతో శుక్రవారం మధ్యాహ్నం మైదుకూరురోడ్ మంచినీటి చలివేంద్ర వద్ద సుమారు 450 మందికి పైగా మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని దివ్య హాస్పిటల్ డాక్టర్ క్రాంతికుమార్, ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కే.వి సుబ్బారావు, జొన్నలగడ్డ సుధాకర్ (వస్త్రం) చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది, మజ్జిగ వితరణకు సహకరించిన మోలాలి గారికి డాక్టర్ క్రాంతి కుమార్ చేతుల మీదుగా శాలువా కప్పి వారికి ప్రత్యేక అభినందనలు తెలపడం జరిగింది, ఈ సందర్భంగా డాక్టర్ క్రాంతి కుమార్ మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజల దాహర్తి తీర్చుట కొరకు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6:00 వరకు ప్రత్యేక కూల్ ఫ్రిడ్జ్ ద్వారా కూల్ వాటర్ వితరణ చేయడమే కాకుండా మధ్యాహ్నం మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని కూడా దాతల సహకారంతో ఏర్పాటు చేయడం సంతోష్ కరమైన విషయం అన్నారు, అనంతరం మజ్జిగ వితరణకు సహకరించిన మోలాలిని వారు అభినందించారు, ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు అనుముల శెట్టి సిద్దయ్య మాజీ సెక్రెటరీ పెసల సుధాకర్ దివ్య హాస్పిటల్ ల్యాబ్ టెక్నీషియన్ రంగా మరియు రమణ తోపాటు పలువురు పాల్గొన్నారు.

## వేంపల్లెలో 30 యాక్ట్ అమలు



**వేంపల్లె : ఏప్రిల్ 04 (ప్రభాత వార్త):**
పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్ ఆదేశాల మేరకు వేంపల్లె పట్టణంలో 30 యాక్ట్ అమలు చేస్తున్నట్లు వేంపల్లి ఎస్ఐ రంగారావు తెలిపారు. పోలీస్ చట్టం 1861 ప్రకారం ఏప్రిల్ నెల 30 వ తేది వరకు సెక్షన్ 30 యాక్ట్ అమల్లో ఉంటుందని ఎస్ఐ రంగారావు తెలిపారు. ఏ విధమైన సమావేశాలు, ప్రదర్శనలు, బహిరంగ సమావేశాలు నిర్వహించకూడదని తెలిపారు. ప్రజల ప్రాణాలకు మరియు ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే కార్యక్రమాలు నిర్వహించకూడదని ఆదేశించారు. బహిరంగ సమావేశాలు లేదా ప్రదర్శనలు నిర్వహించాలనుకుంటే ముందుగా పోలీసు వారి అనుమతి తీసుకోవాలని సూచించారు. ఈ ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రంగారావు తెలిపారు.

## ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన మహమ్మద్ రఫీ



**సిద్దవటం, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
మండల ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న చిరంజీవి గత ఏడాది డిసెంబరులో అన్నమయ్య జిల్లా క్రైం శాఖకు బదిలీ కావడంతో గత 4 నెలలుగా ఎస్సై పోస్టు నియమించక ఒంటిమిట్ట ఎస్సై శివప్రసాద్ ఇన్ఛార్జిగా కొనసాగారు. శుక్రవారం మండల ఎస్సైగా ప్రొద్దుటూరు రూరల్ స్టేషన్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ రఫీ కర్నూలు రేంజ్ డీఐజీ ఉత్తర్వుల మేరకు సిద్దవటం మండల ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కక్ష పూరిత గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏదైనా సమస్య ఉంటే ఫిర్యాదు చేయాలని ఆయన తెలిపారు.

## సాధారణ కాన్పులు శ్రేయష్కరం



**కలికిరి, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
గర్భిణీలకు సాధారణ కాన్పులు శ్రేయష్కరమని ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి డా.వై.పవన్‌కుమార్, గైనకాలజిస్ట్ డా.ఆశాలతలు తెలిపారు. శుక్రవారం కలికిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణీలకు సాధారణ కాన్పులు జరిగితే రికవరీ తొందరగా ఉంటుందని చెప్పారు. కాన్పు అయిన మరుసటి రోజే ఇంటికి వెళ్లవచ్చన్నారు. ఆపరేషన్ అయితే వారం రోజుల పాటు ఆసుపత్రిలో ఉండాలని తద్వారా కలిగే నష్టాలు వివరించారు. ప్రతి నెల క్రమం తప్పకుండా గైనకాలజిస్ట్ వద్ద పరీక్షలు చేయించుకొని వారి సూచనలు పాటించాలన్నారు. సాధారణ కాన్పు అయితే పిల్లల్లో రోగ నిరోధక శక్తి కూడా ఎక్కువ ఉంటుందని తెలిపారు. గత నెలలో కలికిరి ఆసుపత్రిలో మొత్తం సాధారణ కాన్పులు జరిగాయని వివరించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలు, వైద్యులు, నర్సులు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ అర్బన్ హౌసింగ్ ద్వారా ఎస్సీ, ఎస్టీలకు లబ్ధి



**జమ్మలమడుగు, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
అంబవరం ఎన్టీఆర్ అర్బన్ హౌసింగ్ ద్వారా ఎస్సీ మరియు బీసీ లబ్ధిదారులందరికీ (గత వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారులు) అదనంగా రూ.50వేలు మరియు ఎస్టీ లబ్ధిదారులకు అదనంగా రూ.75వేలు మంజూరు చేయడం జరిగింది. ఈ మేరకు శుక్రవారం లబ్ధిదారులతో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి సమావేశమై ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, మున్సిపల్ అధికారులు, హౌసింగ్ అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతులకు పూర్తి సహాయాన్ని అందిస్తాం



**బద్వేలు, ఏప్రిల్ 4, ప్రభాత వార్త**
బద్వేల్ నియోజకవర్గంలో గురువారం కురిసిన అకాల వర్షాల కారణంగా పలు చోట్ల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, దీంతో రైతులు భారీ నష్టాన్ని ఎదుర్కొన్నారని తెలుగుదేశం పార్టీ బద్వేల్ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ధైర్యంగా ఉండాలని, కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమం కోరే ప్రభుత్వమని, రైతుల కోసం ఇప్పటికే అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తరఫున నష్టపరిహారం అందించి వారిని ఆదుకుంటామని తెలిపారు. ఇప్పటికే నష్టంపై అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను సైతం ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు తో మాట్లాడడం జరిగిందనీ త్వరలోనే రైతులకు న్యాయం చేయాలని కోరడమైనదన్నారు

## లిబరేషన్ పార్టీ జిల్లా మహాసభను జయప్రదం చేయండి



**బద్వేలు, ఏప్రిల్ 4, ప్రభాతవార్త**
ఈనెల 8వ తేదీ మంగళవారం కడప నగరంలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవనం నందు జరగనున్న సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నిర్మాణ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక బద్వేల్ పట్టణంలోని పార్టీ కార్యాలయం నందు మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. పార్టీ జిల్లా నాయకులు కామ్రేడ్ సంగటి చంద్రశేఖర్ వారి పార్టీ నాయకులతో కలిసి మాట్లాడుతూ, భారతదేశంలో 1975 వ సంవత్సరంలో పార్టీ ఏర్పడి అనేక ఉద్యమాలలో ప్రాణాలను సైతం పణంగా పెట్టిన చరిత్ర సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీదని, ఉత్తర భారత దేశంలో పార్టీ నడిపిన రాజీలేని పోరాటాల కారణంగా నేడు బీహార్ ఝార్ఖండ్ మరియు కేంద్ర పాలిత ప్రాంతాలలో శాసనసభ్యులను మరియు ఇతర లోక్సభ సభ్యులను కలిగి ఉండి ప్రజల మన్ననలను పొందినదని వారు తెలియజేశారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం, సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి నిధుల సాధన కోసం ఈ మహాసభ వేదికగా భవిష్యత్తు పోరాట కార్యక్రమాలను రూపొందించుకొని ముందుకు వెళ్లడానికి ఈ మహాసభలో చర్చించి తీర్మానాలు చేయబోతున్నామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చంద్రమోహన్ రాజు, జకరయ్య నియోజకవర్గ పార్టీ నాయకులు రామరాజు, విజయరావు, అనిల్, బాబు, నారాయణ, జైపాల్, తదితరులు పాల్గొన్నారు

## పీలేరు రెవెన్యూ కార్యాలయంలో డిటి సీటు ఖాళీ

**పీలేరు ఏప్రిల్ 4 ప్రభాతవార్త:**
పీలేరు రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దారు స్థాయి అధికారి లేక ఆ సీటు వెలవెలబోతోంది. ఆ స్థానంలో ఉన్న డిప్యూటీ తహశీల్దారు రెడ్డెప్ప రెడ్డి అన్నమయ్య జిల్లా కేంద్రానికి డిప్యూటేషన్ పై వెళ్లారు. దీంతో ఆస్థానంలో మరొకరిని నియమించకపోవడంతో పీలేరు మండలం లోని రెవెన్యూ సమస్యలపై ప్రజలకు సరైన సమాచారం ఇచ్చే దిక్కు లేక వచ్చినవారు వెనుదిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యల పరిష్కార వివరాల కోసం వచ్చి నిరాశతో వెనుదిరిగి వెళ్లే పరిస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. డిటి డిప్యూటేషన్ పై వెళ్లి నెలలు గడుస్తున్నా, ఆ స్థానాన్ని మరొకరితో భర్తీ చేయకపోవడంతో అర్జీదారులకు సమాచారం, సమాధానం చెప్పే దిక్కు లేక పదుల సంఖ్యలో విన్నపాలు పెండింగ్లో ఉంటున్నాయని తెలిసింది. బాధితులు, రైతుల సమస్యలకు పరిష్కారం చూపే సంబంధిత బాధ్యతగల అధికారితో ఆ స్థానాన్ని భర్తీ చేయక పోవడంతో ప్రజలు, రైతులు తమ సమయాన్ని వృధా చేసుకుని వచ్చి వెళ్లాల్సి వస్తోందంటూ వారు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పీలేరు రెవెన్యూ కార్యాలయంలో సంబంధిత అధికారిని నియమించాలని పలువురు కోరుతున్నారు.

## ఆసుపత్రి ఆవరణంలో క్యాంటీన్ ప్రారంభం



క్యాంటీన్ ప్రారంభిస్తున్న దృశ్యం

**పీలేరు ఏప్రిల్ 4 ప్రభాతవార్త :**
పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి ఆవరణంలో రోగులు, వారి సహాయకులకు సౌకర్యంగా కొత్తగా క్యాంటీన్ ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సహకారంతో శుక్రవారం జిలాని, షమ ఆధ్వర్యంలో క్యాంటీన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి బాబు రెడ్డి, ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్న రోగులకు వేడినీరు, ప్రజలకు నాణ్యమైన టిఫిన్, భోజనం అందించాలని, క్యాంటీన్ ఆవరణలో పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్యదర్శి, పీలేరు ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి, ఎంప్లాయిస్ యూనియన్ పీలేరు డిపో గౌరవ అధ్యక్షులు శ్రీనాథ్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పసుపులేటి లక్ష్మీకర, టిడిపి సీనియర్ నాయకులు లడ్డు జాఫర్, మాజీ వైస్ ఎంపీపీ పోలిశెట్టి సురేంద్ర, పీలేరు మండల తెలుగు యువత అధ్యక్షులు నల్లారి రియాజ్, ఇతర నాయకులు బుజ్జు, నౌలాక్, ఇస్మాయిల్, అత్తార్ చాంద్ బాష, చెన్నారెడ్డి కాలనీ హరి, కాలనీ ఎర్ర శీను, షౌకత్, చంద్రలేఖ, బాలాజీ, టిడిపి శ్రేణులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చెరువు అక్రమణపై చర్యలు తీసుకోవాలి

**పోరుమామిళ్ల రూరల్ , ఏప్రిల్ 4 ప్రభాతవార్త:**
మండలంలోని రంగసముద్రం చెరువు ఆక్రమణ పై లక్షణం చర్యలు తీసుకోవాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర సెక్రటరీ ముత్యాల ప్రసాద్ రావు కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఉన్న ఇరిగేషన్ అధికారులు వెనకడుగు వేస్తున్నారని పేర్కొన్నారు. పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం చెరువు సర్వే నెంబర్ 217 లో 46 ఎకరాలు, 226 లో 135 ఎకరాలు 227. లో 41 ఎకరాలు,916లో 41 ఎకరాల చెరువును మొత్తం ఆక్రమించుకుని ఉన్నారని వాటిని తొలగించమని జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్,ఆర్డిఓ, తాసిల్దార్ లకు దరఖాస్తు రూపంలో రైతులు, నీటి సంఘం చైర్మన్ కలిసి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.ఇంతవరకు చెరువు ఆక్రమణ పై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆయన తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఇచ్చినప్పటికీ చెరువులో అక్రమంగా దొంగ పట్టాలు పొందిన వారందరి వాటిని జిల్లా కలెక్టర్ రద్దు చేయడం జరిగిందన్నారు. కలెక్టర్ ఆదేశాలు పాటించకపోవటమే కాకుండా ఇంతవరకు చెరువు ఆక్రమణ తొలగింపుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆయన పేర్కొన్నారు. ఇరిగేషన్ అధికారులు ఇప్పటికైనా వెంటనే చర్యలు చేపట్టి చెరువు ఆక్రములను తొలగించి రైతులకు ఉపయోగపడే విధంగా చెరువులు నీటి నిల్వను ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు. వర్షాలు కురుస్తున్న తరంలో నీటి నిల్వ లేకపోవడం వలన బోర్లకు నీరు రాక అనేక రకాలుగా రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే చెరువు ఆక్రమించిన వారిపై చర్యలు చేపట్టి రైతుల శ్రేయస్సు కొరకు పాటుపడాలని కోరారు. అధికారులు వెంటనే చర్యలు చేపట్టకపోతే మరో సారి జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయవలసి వస్తుందని ఆయన పేర్కొన్నారు.

## గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యం

**పీలేరు ఏప్రిల్ 4 ప్రభాతవార్త :**



పీలేరు పట్టణ శివారులోని కడప రోడ్డులో ఓ గుర్తు తెలియని యువకుడి మృతదేహం శుక్రవారం గుర్తించినట్లు ఎస్సై బాలకృష్ణ తెలిపారు. స్థానిక కడప రోడ్డులోని ఓ వైన్ షాప్ సమీపంలో గురువారం రాత్రి 12:40 గంటల సమయంలో ఈ వ్యక్తి మరణించి ఉంటాడని భావిస్తున్నారు. సుమారు 35 40 ఏళ్ళ మధ్య వయస్సు కలిగి ఉండి, చామన ఛాయ రంగులో ఉన్నాడని, అతని కుడి భుజంపై పచ్చబొట్టు, కుడిచేయి మణికట్టుకు ఎర్రని దారం కట్టబడి, కడియం కలిగి ఉన్నాడన్నారు. అంతేకాకుండా మరణించిన వ్యక్తి మాసిన లేత నీలి రంగు టి షర్టు, నలుపు రంగు షార్ట్ ధరించి ఉన్నాడు. ఈ ఫోటోలోని మృతుడి వివరాలు తెలిసిన వారు పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ సెల్ నెంబరు: 9440796744కు లేదా ఎస్సై సెల్ నెంబరు: 9440796745కు సమాచారం అందించాలని తెలియజేశారు.

## అన్నదాన సత్రంలో హుండీ చోరీ

**పోరుమామిళ్ల రూరల్, ఏప్రిల్ 4ప్రభాతవార్త:**



పోరుమామిళ్ల మండలం శ్రీ మద్దిమాను గురప్ప స్వామి అన్నదాన సత్రంలో గురువారం రాత్రి చోరీ జరిగినట్లు ఈవో నరసయ్య తెలియజేశారు. గురువారం రాత్రి బారి వర్షం పడడంతో అక్కడ ఉన్న వాచ్మెన్ రామసుబ్బయ్య ఇంటికి వెళ్లి తిరిగి వచ్చేసరికి దొంగతనం జరిగినట్లు గుర్తించినారు. అన్నదాన సత్రం గేటు తాళం పగలగొట్టి అక్కడున్న హుండీ ఆలయం సమీపంలోని ముళ్లపదల్లో పడవేసి వెళ్లారు. విషయం తెలుసుకొన్న ఈవో నరసయ్య శుక్రవారం ఏఎస్ఐ మూర్తికి ఫిర్యాదు ఇవ్వగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అక్కడ పరిశీలించిన తర్వాత పూర్తి వివరాలు తెలియాల్సిందని తెలియజేశారు.

## జూనియర్ సివిల్ జడ్జీ మోడల్ పరీక్షకు హాజరుకండి

**కడప లీగల్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
కడప బార్ అసోసియేషన్ హాలు నందు శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) ఆధ్వర్యంలో జరుగుతున్న జూనియర్ సివిల్ జడ్జీ మోడల్ పరీక్షకు యువ న్యాయవాదులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రవదన పిలుపునిచ్చారు. శుక్రవారం వారు బార్ అసోసియేషన్ ఆఫీసులో విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 16న జరుగనున్న ఐఏఎల్ మోడల్ పరీక్ష చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. శనివారం ఉదయం 10.15 గంటలకు బార్ అసోసియేషన్ హాలు వద్దకు పరీక్ష రాయదలచిన వారు చేరుకోవాలని 11 గంటలకు మోడల్ పరీక్ష ప్రారంభమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్యాడ్ వెంట తెచ్చుకోవాలని ఐఏఎల్ జిల్లా నాయకులు సి.సుబ్రమణ్యం, టి.ఈశ్వర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కడప బార్ ఉపాధ్యక్షులు ఉమాదేవి, ట్రెజరర్ సురేష్, స్పోర్ట్స్ సెక్రటరీ చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశం

**కడప లీగల్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి సూచనలతో జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జీ ఎస్.బాబాఫక్రుద్దీన్ కడప న్యాయ సేవాసదన్ నందు అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెయిల్స్, అప్పీళ్లు, ష్యూరిటీలు, నగదు, సర్యూటీలు, సాధికార కమిటీ, చట్టపరమైన సహాయం డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్స్ తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎన్.హరిబాబు, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్లు శ్రీమతి ఎం.శాంత, వినయ్ కుమార్, శ్రీమతి చంద్రకాంతమ్మ, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్లు మనోహర్, సౌజన్య, నీలకంఠేశ్వరరెడ్డి, షేక్ అక్బర్ అలీ, ఏఎస్ రవితేజ, ప్రవీణ్‌కుమార్, పారా లీగల్ వాలంటరీలు పాల్గొన్నారు.

## అడవికి నిప్పు మానవాళికి పెనుముప్పు

**చిట్వేలి, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
మానవ మనవుడకు జీవనాధారమైన ప్రకృతి సిద్ధ అడవులకు నిప్పు పెట్టడం మానవాళికి పెనుముప్పుగా మారుతుందని సబ్ డి ఎఫ్ ఓ సుబ్బురాజ్ అన్నారు. శుక్రవారం స్థానిక రేంజ్ కార్యాలయంలో 7 లక్షల రూపాయల కాంపా నిధులతో నిర్మించిన విశ్రాంత భవనం, కార్యాలయమును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో తాను మాట్లాడుతూ అనుమతి లేకుండా అడవుల్లోకి వెళ్లడం నేరంగా పరిగణించబడుతుందన్నారు. అడవి సంపదను స్మగ్లింగ్ చేయడం, అడవి జంతువులకు హాని తలపెట్టడం, అడవులకు నిప్పు పెట్టడం శిక్షార్హమన్నారు. శ్రీ పెనిశిల అభయారణ్యం అరుదైన ఎర్రచందనం,అన్ని రకాల జంతువులు, పక్షులకు నిలయంగా ఉందన్నారు. చిరుతపులలో సంచారం తో పాటు పెద్దపులికి ఆవాసంగా మారడం చాలా గొప్ప విషయమని తెలిపారు. ఇంతటి ప్రాధాన్యత గల అడవి సంరక్షణ బాధ్యత మన అందరిదని గుర్తు చేశారు. జంతు సంరక్షణ 1972 చట్టం ప్రకారం చట్టం అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతులు లేకుండా ఓబులవారిపల్లి గుండాల కోన అడవిలోకి వెళ్లి ఏనుగుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన సంఘటనను గుర్తు చేశారు. అడవులను సంరక్షించడంలో, అక్రమ రవాణాను నిరోధించడంలో ప్రజలు తమకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. రేంజ్ అధికారి ధీరజ్ మాట్లాడుతూ అడవుల్లో నీటి కుంటలు, పచ్చిక బయళ్లు, విస్తరణ తదితర కార్యక్రమాలను అధికార అనుమతులతో చేపడుతామన్నారు. రానున్న వేసవి దృష్ట్యా మంటలనుంచి అడవులను రక్షించడానికి తమ సిబ్బందితో ప్రత్యేక గస్తీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ అడవుల సంరక్షణను తమ బాధ్యతగా తీసుకోవాలని, రాబోవు తరాలకు వాటి ఫలాలను అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ.లు శ్రీనువాసులు, సావిత్రి, ఎఫ్‌బిఓ లు కరిముల్లా, రమేష్, సుబ్బయ్య, సుబ్బరాయుడు, సుధాకర్, చంగమ్మ, ఏబిఓలు సుబ్బారెడ్డి, ఈశ్వరయ్య,ప్రొటక్షన్ వాచర్లు స్థానిక కూటమి నాయకులు ఎంపీటీసీ నాగార్జున, సర్పంచ్ నరసింహ లు పాల్గొన్నారు.



పాల్గొన్న సబ్ డీఎఫ్ఓ, ఎఫ్ ఆర్ ఓ, సిబ్బంది.

# సమస్యల సుడి గుండంలో వేంపల్లి గ్రామ పంచాయతీ

**వేంపల్లి: ఏప్రిల్ 04 (ప్రభాత వార్త):**
మాజీ ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల నియోజకవర్గం లో వున్న వేంపల్లి మేజర్ గ్రామ పంచాయతీ సమస్యల సుడిగుండం లో కొట్టుమిట్టాడు తోందని,మురికి కూపం గా తయారయింది అని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్. తులసి రెడ్డి విరుచుకు పడ్డారు. శుక్రవారం కాంగ్రెస్ నాయకులు వేంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బంది సమస్యలను, పంచాయతీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత మార్చి నెల 5వ తేదీన అప్పటి ఈవో ను అక్రమాలు జరిగాయని సస్పెండ్ చేశారు. ఈ ఓ ఆర్ డి ని బదిలీ చేశారు. అట్లూరు ఈ ఓ ఆర్ డి శివప్రసాద్ ను ఇన్చార్జి గా వేసినా ఆయన చేరలేదు. ఇక్కడికి ఈవో గా ఎవ్వరు రావాలన్నా అవినీతి ఆరోపణలు,రాజకీయ జోక్యం తో భయపడి పోతున్నారు. తెనాలి రామకృష్ణుడు,పిల్లి కథ లాగా తయారయింది. పారిశుధ్య , వాటర్ స్కీమ్ సిబ్బందికి 5 నెలలుగా జీతాలు లేవు. పారిశుధ్యం అధ్వాన్నం అయింది. మురికి నీటి కాలువలు చెత్తా చెదారం తో నిండిపోయాయి.మురికి నీరు రోడ్ల మీద ప్రవహిస్తూ వుంది. పందులు,దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. మలేరియా,డెంగ్యూ,టైఫాయిడ్,అతిసార వ్యాధులు విజృంభించాయి. భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లు ఎండిపోయాయి. త్రాగునీటి సమస్య జటిలమయింది.ఇంటి పన్ను, నీటి పన్ను రాబట్టడం లేదు. మార్చి 31 కి మార్కెట్ వేలం గడువు ముగిసింది.ఇఓ లేని కారణంగా టెండర్ నిలిచి పోయింది. నియోజక వర్గ ఎమ్మెల్యే జగన్ కు ప్రతిపక్ష నాయకుని హోదా తప్ప నియోజకవర్గ సమస్యలు పట్టడం లేదు. స్థానిక అధికార కూటమి నాయకులు పట్టించుకోవడం లేదు. జిల్లా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వుంది అని తులసి రెడ్డి ధ్వజమెత్తారు. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ఈవో, ఈ ఓ ఆర్ డి లను నియమించాలని,సిబ్బంది వేతనాలు వెంటనే చెల్లించాలని, పారిశుధ్యం పై, త్రాగి నీటి సమస్య పై తక్షణం దృష్టి సారించాలని జిల్లా అధికార యంత్రాంగం కు, అధికార పార్టీ నాయకులకు తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పులివెందుల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త ధ్రువ కుమార్ రెడ్డి, డాక్టర్ సుబ్రమణ్యం, రామాంజనేయ రెడ్డి,అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న, బద్రి నాథ్, నాగరాజు, రమణ, వినయ్, మదార్,చందు, గంగోజీ, గంగ రాజు తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.




## 26 మందిపై కేసులు నమోదు

**మదనపల్లి క్రైమ్ ఏప్రిల్ 4 ప్రభాతవార్త.**
మదనపల్లి పట్టణంలో నిర్లక్ష్యంగా, వేగంగా ద్విచక్ర వాహనాలు నడుపుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన 26 మందిపై కేసులు నమోదు చేసినట్టు డిఎస్పి కొండయ్య నాయుడు తెలిపారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు శుక్రవారం డిఎస్పి ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మైనర్లు ద్విచక్ర వాహనాలను వేగంగా నడపడంతో పాటు, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం, సైలెన్సర్ లేకుండా పెద్ద శబ్దాలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం కనిపించింది. ఇలాంటి వారిని 26 మందిని గుర్తించి, వారి ద్విచక్ర వాహనాలను సీజ్ చేసామన్నారు. కేసు నమోదు చేయడంతో పాటు వారి తల్లిదండ్రులపై కూడా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామన్నారు. ఈ తనిఖీల్లో పట్టణంలోని సిఐలు ఎరిసా వల్లి, రామచంద్ర, మోహన్ రావు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## టూటౌన్ సీఐగా బాధ్యత చేపట్టిన సదాశివయ్య

**ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త :**
ప్రొద్దుటూరు టూటౌన్ సిఐగా శుక్రవారం సదాశివయ్య బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి పిటిసి నుండి ప్రొద్దుటూరుకి ఆయన సీఐగా బదిలీపై వచ్చారు. గతంలో ఈయన ప్రొద్దుటూరు టూటౌన్, ఎర్రగుంట్ల, అనంతపురం లో విధులు నిర్వహించారు. ప్రస్తుతం తిరిగి పట్టణంలో టూటౌన్ సిఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని వివరించారు.

## పాస్‌పోర్టు పోయినది

షేక్ అబ్దుల్ రెహమాన్ తండ్రి షేక్ హబీబ్ డోర్ నెం. 6/62, శంకరాపురం, కడప, ఏపీ. నా పాస్పోర్ట్ నెంబర్ W1075019 కడప నగరం అప్సర సర్కిల్ జిరాక్స్ సెంటర్ దగ్గర 1532025 తేదీన పోయినది. ఎవరికైనా దొరికినచో కింది నెంబర్కు తెలుపగలరు. సెల్ 6303260530

## మహిళా సంఘ సభ్యుల ఆర్థిక ప్రణాళికపై సర్వే



ఆర్థిక ప్రణాళిక సర్వే పై సూచనలు ఇస్తున్న ఏపీఎం గంగాధర్

తంబళ్లపల్లె ఏప్రిల్ 4 ప్రభాతవార్త ః
మండలంలోని మహిళా సంఘాల సభ్యుల ఆర్థిక ప్రణాళిక సర్వే నిష్పక్షపాతంగా పూర్తి చేయాలని ఏపీఎం గంగాధర్ సిఆర్పిలకు సూచించారు. శుక్రవారం ఆయన సీఆర్పీలతో మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు తాము పొందిన రుణాల వివరాలు సేకరించాలన్నారు. వారు జీవనోపాధి, ఆదాయాభివృద్ధి, ఇతర అవసరాలకు చేసిన ఖర్చు, ప్రస్తుతం వారు తీసుకున్న రుణాలు గ్రూపు, వివో, బ్యాంకు లింకేజీ, శ్రీనిధి, సిఐఎఫ్, ఉన్నతి రుణాలు ఎందుకు ఉపయోగించారనే వివరాలను కూలంకషంగా నిర్వహించాలన్నారు. ప్రతి ఐదు లేక ఆరు సంఘాలకు ఒక సిఆర్పి ఈ సర్వేలో పాల్గొనాల్సి ఉందన్నారు. భవిష్యత్తులో సంఘ సభ్యులు రుణాలు పొందడానికి ముందస్తు ప్రణాళిక తో రుణాలు పొందాల్సి ఉందన్నారు. ఈ సర్వే వివరాలను సంఘ మిత్రల సహకారంతో త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిసిలు రమణ, కత్తి నరసింహులు, ఆదిలక్ష్మి, మండలంలోని సిఆర్పిలు, సంఘమిత్రలు, వివో సభ్యులు పాల్గొన్నారు.

## సుండుపల్లి మండల ప్రజలకు హెచ్చరిక..

సుండుపల్లి, ఏప్రిల్, ప్రభాతవార్త:
ఆదివారం జరగబోవు శ్రీరామనవమి పండుగ,సానిపాయ గ్రామ జాతర మరియు తిరునాళ్లను పురస్కరించుకొని సుండుపల్లి మండలం నందు స్వామి వారి ఊరేగింపు ఉన్న ఎడల లేదా చాందిని బండి కట్టిన యెడల కచ్చితంగా 24 గంటల ముందు పోలీస్ వారి పర్మిషన్ తీసుకొనవలెను.ఎట్టి పరిస్థితుల్లో రికార్డింగ్ డాన్సులు కానీ ఎటువంటి డాన్సులు గాని అనుమతించబడవు ఎవరైనా డాన్సులు కార్యక్రమం పెట్టిన యెడల వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేయబడునని సుండుపల్లి ఎస్సై ముత్యాల. శ్రీనివాసులు తెలియజేసారు.

## ఎంవిఆర్ 82వ జయంతి సందర్భంగా అన్నదానం

ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:



మాజీ శాసనసభ్యుడు స్వర్గీయ డాక్టర్ ఎంవి రమణారెడ్డి 82 వ జయంతి సందర్భంగా ప్రాణదాత సేవాసమితి ఆధ్వర్యంలో, మాజీ ఎంపీపీ మల్లెల రాజారాం రెడ్డి, మాజీ ఆప్కాబ్ చైర్మన్ మల్లెల ఝాన్సీ రాణి,కుటుంబ సభ్యుల సహకారంతో శుక్రవారం మధ్యాహ్నం కొర్రపాడు రోడ్డులోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పక్కన అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టూటౌన్ సీఐ గోవిందరెడ్డి పాల్గొని పేదలకు అన్నం వడ్డించారు. ఈ కార్యక్రమంలో ప్రాణదాత సేవా సమితి అధ్యక్షుడు డి జివేంద్ర రాజు, సభ్యులు బచ్చల సునీల్, లక్కిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, సుధా రాంభూపాల్ రెడ్డి, బాలకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## డియస్సి పరీక్షలకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ

ఎడ్యుకేషన్ ఏప్రిల్ 4 ప్రభాతవార్త:
రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించడంతో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, ఆంధ్రప్రదేశ్ బీసీ స్టడీ సర్కిల్, కడప నందు డియస్సి పరీక్షల కొరకు ఆన్‌లైన్ ద్వారా త్వరలో ఉచిత శిక్షణ ఇవ్వబడునని ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) పరీక్షలో అర్హత సాదించిన వారికి కడప జిల్లా వాసులకు మాత్రమే బిసి, (BC) మరియు EWS (EBC) కేటగిరీలకు చెందిన అభ్యర్థుల నుండి మెగా డి.యస్.సి. (S.G.T. S.A.) పరీక్షల కొరకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తులు స్వీ కరించబడును. టెట్ నందు ఉత్తీర్ణులైన వారు అర్హులు మరియు టెట్ పరీక్షల మార్కుల ఆధారంగా ఎంపిక చేయబడుదురు. ఈ శిక్షణ కొరకు మార్చి 10వ తేదీ నుండి దరఖాస్తులు స్వీకరిస్తారు. వివరాలకు నేరుగా కార్యాలయములో గాని, ఫోన్ నెం. 9849919221 9966418572 నందు సంప్రదించగలరు

## బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా నాగమల్లిరెడ్డి

తంబళ్లపల్లె ఏప్రిల్ 4 ప్రభాతవార్త ః



తంబళ్లపల్లె జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసోసియేషన్ ప్రెసిడెంట్ గా అడ్వకేట్ నాగ మల్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం సీనియర్ అడ్వకేట్లు హసన్ వల్లి, సిద్ద లింగారెడ్డి ల ఆధ్వర్యంలో జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికలలో అధ్యక్షుడుగా నాగమల్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గా వెంకటరమణ, జనరల్ సెక్రెటరీగా గఫార్ సాహెబ్, జాయింట్ సెక్రెటరీగా శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని కోర్టు అడ్వకేట్లు, సిబ్బంది శుభాకాంక్షలు తెలుపగా వారు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## కూలీలు మూడు పూటలా అన్నం
## తినగలుగుతున్నారంటే నరేంద్రసింగ్ బేడీ ఘనతే

గాలివీడు, ఏప్రిల్ 4(ప్రభాతవార్త):



ఉపాధి కూలీలు ఈ రోజు మూడు పూటలా అన్నం తిన్నగలుగుతున్నా రంటే నరేంద్రసింగ్ బేడీ ఘనతే అని ఉమ్మడి కడప జిల్లా యంగ్ ఇండియా ప్రాజెక్టు కార్యకర్తలు, ఏపీ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ సభ్యులు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సాధక కర్త నరేంద్రసింగ్ బేడీ స్మారక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్లు మాట్లాడుగూ ఎంగిండే ప్రాజెక్టు అధ్యక్షులు నరేంద్రసింగ్‌బేడీ ప్రధమస్థానంలో ఉండి ఉపాధి హామీ చట్టం కోసం అనేక సంవత్సరాల పోరాటమే నేడు కూలీలు పనులు చేయగలుగుతున్నారని తెలిపారు. ఉపాధి హామీ చట్టాలపైన సంఘాలతో యూనియన్లతో కలిసి అనేక సంవత్సరాలుగా పోరాటం వల్ల వచ్చిన పలితమే ఈ ఉపాధి హామీ పథకం సమాన పనికి సమాన వేతనం దొరుకుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో యంగ్ ఇండియా ప్రాజెక్టు కార్యకర్తలు, ఏపీవ్యవసాయ వృత్తిదారుల యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఊరెళ్లేవారు జాగ్రత్తలు వహించాలి: ఎస్ఐ రామకృష్ణ

గాలివీడు, ఏప్రిల్ 4(ప్రభాతవార్త):



పండుగలకు, జాతర్లకు ఊరెళ్లేవారు వేసవికాలంలో రాత్రివేళ ఇండ్లపైన ఇంటి బయట నిద్రించేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గాలివీడు ఎస్ఐ రామకృష్ణ సూచించారు. పోలీస్‌స్టేషన్లో శుక్రవారం ఎస్ఐ మాట్లాడుతూ పండుగలకు, తిరునాళ్లకు ఊరెళ్లే వారి కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను తీసుకోవాలని, వారు ఇంట్లో విలువైన వస్తువులను, నగదు ఉంచొద్దని, బా యకు లాకర్లలో జాగ్రత్తగా భద్రపరచుకోవాలని సూచించారు. ఇంటి ముందు చెప్పులు ఉంచాలని, బయట గేటుకు లోపల నుంచి తాళం వేయాలన్నారు. ఇంటి ముందు గదిలో లైట్ వేసి ఉంచాలని తెలిపారు. బీరువాలలో బంగారు ఆభరణాలు, నగదును పెట్టొద్దని సూచించారు. ఊరెళ్లే ముందు స్థానికులకు, నమ్మకస్తులకు, పోలీస్‌స్టేషన్లో సమాచారం ఇవ్వాలని కోరారు. కాలనీలలో, వీధుల్లో గుర్తు తెలియని వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని లేదా 100కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సూచించారు. అలాగే మైనర్లకు సరదా కోసం బైకులు ఇస్తే మీజ వితంలో కొత్త సమస్యలు కొని తెచ్చుకున్నట్లేనని హెచ్చరించారు.

## వెంకటేష్ కుటుంబానికి అండగా ఉంటాం

మదనపల్లె, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :



వెంకటేష్‌ను పరామర్శిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రాజంపేట పార్లమెంటరీ ఐటిడిపి ఉపాధ్యక్షులు వేల్పుల వెంకటేష్ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని ఐటిడిపి రాష్ట్ర అధ్యక్షులు చింతకాయల విజయ్ హామీ ఇచ్చారు. వెంకటేష్ ఆత్మహత్యాయత్నం విషయం తెలుసుకొన్న మంత్రి నారాలోకేష్ ఆదేశాల మేరకు తాను మదనపల్లెకు విచ్చేసి ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న అతనిని శుక్రవారం పరామర్శించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేల్పుల వెంకటేష్ పిల్లలను ఎన్‌టిఆర్ ట్రస్టు ద్వారా చదివిస్తామని, అదే విధంగా ఆయన కుటుంబాన్ని సంపూర్ణంగా ఆదుకొంటామన్నారు. ఐటిడిపి సభ్యులు ఎవరూ ఎలాంటి అఘాయిత్యానికి ఒడిగట్టకూడదని రెండుచేతులు జోడించి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు, ఎమ్మెల్యే తనయుడు అక్బర్ జునైద్, రాష్ట్ర మైనార్టీ నాయకులు ఎస్.ఎ.మస్తాన్, పట్టణ ఉపాధ్యక్షులు ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి, ఒకటవ వార్డు ఇన్‌చార్జ్ మల్లికార్జుననాయుడు, డ్యాన్స్ రెడ్డప్ప, పూలకుంట్ల హరిబాబు, చిన్నమహేష్, శ్రీనివాసులు, చంద్రమోహన్‌నాయుడు, అనీల్‌రెడ్డి, గురుమూర్తిరెడ్డి, శేఖర్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

## సవరణ బిల్లు ఆమోదించడం అన్యాయం

### కాంగ్రెస్ మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌కె.బాషా

మదనపల్లె, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :



ముస్లిం మైనార్టీల మనోభావాలను దెబ్బతీసే వక్ఫ్‌చట్ట సవరణ బిల్లుకు కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యులైన తెలుగుదేశం, జనసేన పార్టీలు మద్దతు ఇవ్వడం అన్యాయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్‌కె.బాషా ఆరోపించారు. శుక్రవారం ఆయన కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ముస్లింలకు అన్యాయం చేసే బిల్లుకు మద్దతు ఇవ్వడం అంటేనే ముస్లిం సమాజానికి ద్రోహం చేయడమే అన్నారు. దేశ, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వక్ఫ్‌ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడటం కోసం వక్ఫ్ బిల్లులో సవరణ చేస్తున్నామనడనం ఎంత మాత్రం నిజం కాదన్నారు. అన్యాక్రాంతమైన వక్ఫ్ ఆస్థులను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తిరిగి స్వాధీనం చేసుకొని అందులో మైనార్టీల అభివృద్ధి కోసం షాదీమహాల్స్‌తో విద్యాసంస్థలను ఏర్పాటు చేసి అన్ని విధాలుగా ముందుకు తీసుకెలితే స్వాగతిస్తామని తెలిపారు. వక్ఫ్‌సవరణ చట్టం 2024 బిల్లును లోకసభ ఆమోదం పొందడం అంటే ముస్లింలకు చీకటి రోజులు అన్నారు. ఇందుకు ముస్లిం మైనార్టీల నుంచి టిడిపి, జనసేన పార్టీలకు తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటికైనా బిజెపి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు మైనార్టీల పట్ల తమ వైఖరిని మార్చుకోకపోతే వచ్చే ఎన్నికల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని తెలిపారు.

## మహాసభలను జయప్రదం చేయండి

మదనపల్లె, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :
తమిళనాడులోని మధురై నగరంలో ఈనెల 6న జరగనున్న భారత కమ్యూనిస్టుపార్టీ అఖిలభారత 24వ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన సిపిఎం శ్రేణులతో కలసి మహాసభలకు తరలివెళ్ళారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతోన్మాదశక్తుల నుంచి దేశాన్ని కాపడుకోవడంతో పాటు కార్పోరేట్ అనుకూల సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన కర్తవ్యాలను ఈ మహాసభ దిశ, నిర్దేశం చేయనున్నదని తెలిపారు. సిపిఎం బలపడడం ద్వారా మాత్రమే కష్టజీవుల వెతలు తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మణి, నాయకులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులు ధర్నా

మదనపల్లె, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :



ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ఇన్సూరెన్స్ చెల్లించి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్‌యూనియన్ ఏఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మస్తాన్‌లు మాట్లాడుతూ గత ఏడాది జులై నుంచి పారిశుద్ధ్య కార్మికులకు ఇన్సూరెన్స్ టైమ్ అయిపోయిందని వెంటనే కార్మికులకు ఇన్సూరెన్స్ డబ్బులు చెల్లించాలని కోరుతున్నా అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇంతవరకు న్యాయంజరగలేదన్నారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఇన్సూరెన్స్ అందక నష్టపోతున్నారన్నారు. అదే విధంగా మున్సిపల్ కార్మికులకు పనిముట్లు కావాలని మూడేళ్ళుగా అడుగుతున్నా ఇంతవరకు పరిష్కారం చేయలేదన్నారు. రెండేళ్ళుగా పెండింగ్‌లో ఉన్న నూనె, సోపులు, పాదరక్షలు ఇవ్వాలన్నారు. ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి,వైస్‌ఛైర్మెన్ జింకా చలపతి చొరవతో ధర్నాను విరమింపచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముభారక్, తిరుమలప్ప, దేవేంద్ర, వాసు, పృధ్విరాజ్, వంశీ, శ్రీనివాసులు, నరసింహులు, బాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పాన్‌పరాగ్‌లు, గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు

కురబలకోట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :



దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

కిరాణ దుకాణదారులు పాన్‌పరాగ్‌లు, గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మదనపల్లె డిఎస్‌పి కొండయ్యనాయుడు అన్నారు. అంగళ్ళు పరిసర ప్రాంతాల్లోని విద్యాసంస్థలను లక్ష్యంగా చేసుకొని విద్యార్థుల కోసం ప్రత్యేకంగా స్మోకింగ్ జోన్ ఏర్పాటు చేసి తాపిస్తున్నారని ఆయన తెలిపారు. విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో ఎలాంటి పొగాకు ఉత్పత్తులను అమ్మకూడదని నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా అంగళ్ళులో విద్యాసంస్థలు సమీపంలోని దుకాణాల్లో మదనపల్లె డిఎస్‌పి, రూరల్ సిఐ, ముదివేడు ఎస్ఐ, రాయచోటి స్పెషల్‌పార్టీ తనిఖీలు నిర్వహించారు.

## సుఖ ప్రసవాలే గర్భిణీలకు శ్రేయస్కరం

తంబళ్లపల్లె ఏప్రిల్ 4 ప్రభాతవార్త ః
గర్భిణీలకు సుఖప్రసవాలతో ఆమెతో బాటు శిశువు ఆరోగ్యానికి శ్రేయస్కరమని డాక్టర్ అమర సింహరాజు సూచించారు. శుక్రవారం సామాజిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి హెడ్ నర్స్ గ్లోరీ మాట్లాడుతూ గర్భిణీలు సుఖ ప్రసవాలు జరిగితే రెండవ కాన్పు కూడా సుఖ ప్రసవం జరిగి బాలింతకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావన్నారు. సుఖ ప్రసవం జరిగిన 24 గంటలలో డిశ్చార్జి చేయడంతో పాటు శిశువు సైతం రోగ నిరోధక శక్తి పెరుగుదల బాలింతలకు ఆరోగ్య సమస్యలు ఉండవని హితభోద చేశారు. గర్భిణీలు ఫస్ట్ డెలివరీ సిజేరియన్ చేసుకుంటే రెండవ కాన్పు సైతం సిజేరియన్ చేయడంతో బాలింత కోలుకోవడానికి సమయం పట్టడంతో పాటు ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని సూచించారు. ఈఅవగాహన కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది తోపాటు గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.



## న్యాయం చేయకపోతే ఆందోళన చేస్తాం



గాంధీ సరుకులు ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

వాల్మీకిపురం, ఏప్రిల్ 04 ప్రభాతవార్త :
మండలంలోని పెద్దవంకపల్లెకు చెందిన ఓ రైతు భూ సమస్యలపై విసిగిపోయి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన విదితమే. ఇదిలా ఉండగా బాధిత కుటుంబానికి న్యాయం జరగలేదని నిరసిస్తూ శుక్రవారం మదనపల్లె, వాల్మీకిపురం మాజీ సైనికుల సంఘం నాయకులు కంచర్ల శ్రీనివాసులు నాయుడు, రవి తదితరుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం మదనపల్లె తిరుపతి జాతీయ రహదారిలోని స్థానిక గాంధీ సర్కిల్ వద్ద పెద్ద ఎత్తున మాజీ సైనికులు, బాధిత కుటుంబ సభ్యులతో కలిసి జాతీయ రహదారిపై బైరాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మహత్య చేసుకున్న రైతు వెంకటాద్రి కేసుకు సంబంధించి అధికారులు కేసును నీరుగార్చారని, ఏ1 గా పెట్టాల్సిన తహసీల్దార్ పేరును ఏ4గా చేర్చడమేంటని వారు ప్రశ్నించారు. ఈ లోగ విషయం తెలుసుకున్న ఎస్సై చంద్రశేఖర్ సంఘటన స్థలానికి చేరుకుని జాతీయ రహదారిపై ధర్నా చేసేందుకు ఎటువంటి అనుమతులు లేవని, తక్షణమే ధర్నా విరమించాలని, ఏదైనా ఉంటే మరో ఫిర్యాదు చేయాలని ఎస్సై సూచించడంతో బాధిత కుటుంబ సభ్యులతో కలిసి మాజీ సైనికోద్యోగులు ఎస్సైకి ఫిర్యాదు చేశారు.

### రైతు ఆత్మహత్య కేసులో ఆరుగురిపై కేసు నమోదు

రైతు వెంకటాద్రి ఆత్మహత్య కేసుకు సంబందించి వెంకట్రమణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మదన్రెడ్డి, తాహసీల్దార్ పామిలేటి, నారాయణరెడ్డి, పీలేరు ఏపీటీయూఎస్ హోమ్లోన్ బ్యాంకు మేనేజర్ మణికంఠ తదితరులపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు.

## సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ

ముద్దనూరు, ఏప్రిల్ 4,ప్రభాతవార్త:



ముద్దనూరు మండలం కె. కొత్తపల్లె గ్రామ పంచాయతి సచివాలయాన్ని ఎండీఓ ముకుందరెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఎస్‌డబ్ల్యూపిసి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ స్కూల్, ఉపాధి పనులు, వాటర్ ట్యాంక్, 104 వాహనం, పారిశుధ్యం పనులను పర్యవేక్షించి,రికార్డులను తనిఖీ చేశారు. గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన సమయంలో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ పవన్ కుమార్ ముందస్తు అనుమతి లేకుండా నాలుగు రోజుల నుంచి గైర్హాజరు అయినందున తక్షణమే మెమో జారీచేసి సంజాయిషీ ఇవ్వవలసిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అరుణమ్మ, ఏపీఓ గంగయ్య, కార్యదర్శి సౌభాగ్య లక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

మైదుకూరు, ఏప్రిల్ 04, ప్రభాతవార్త:



మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు ఎంపీడీవో కె.వి శ్రీధర్ నాయుడు అందజేశారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాలలో ఎండల తీవ్రత దృశ్య కూలీలు ఇబ్బందులు పడకుండా ఉపశమనం కోసం పని అనంతరం ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## పక్కాగృహాల వివరాలు సేకరించండి



పక్కా గృహాల సర్వే పై సూచనలు ఇస్తున్న అధికారులు

తంబళ్లపల్లె ఏప్రిల్ 4 ప్రభాతవార్త ః
అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల ఏడవ తేదీ సోమవారానికి మండలంలో అర్హులైన పక్కాగృహాల లబ్ధిదారుల వివరాలను సర్వే ద్వారా వివరాలు సేకరించి నివేదించాలని తాసిల్దార్ హరికుమార్, ఎంపీడీవో ఉపేందర్ రెడ్డిలు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్వోలను ఆదేశించారు. శుక్రవారం తాసిల్దార్ కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ మండలంలోని 21 పంచాయతీలలో ఇంటింటి సర్వే నిర్వహించి పక్కా గృహాలు లేని వారు, ఇంటి స్థలాలు లేని వారిని గుర్తించి అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ ఇంటింటా సర్వే పారదర్శకంగా నిర్వహించాలని అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పక్కా గృహం అందించే ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చడానికి సహకరించాలన్నారు. హౌసింగ్ ఏఈ సుజాత మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే 545 మంది పక్కా గృహాలకు లబ్దధిదారులు దరఖాస్తులు చేసుకున్నట్లు చెప్పారు. దరఖాస్తుల అనంతరం పొజిషన్ సర్టిఫికెట్లు అందించడానికి సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు తమ పూర్తి సహకారం అందించాలని సూచించారు. ఈ సదస్సులో మండలంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

## 9న మదనపల్లెకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి రాక

మదనపల్లె, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :
ఈనెల 8, 9న జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర రహదారుల భవనాల శాఖామంత్రి బిసి.జనార్థన్‌రెడ్డి తంబళ్ళపల్లె, మదనపల్లె నియోజకవర్గాల్లో పర్యటించనున్నట్లు అధికార వర్గాలు తెలిపారు. 8న మంగళవారం అన్నమయ్యజిల్లాలోని రాయచోటి, రాజంపేట నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో పాల్గొని అదే రోజు రాత్రి హార్సిలీహిల్స్‌కు విచ్చేసి అక్కడే బస చేస్తారు. అనంతరం 9న బుధవారం ఉదయం 9.30గంటల నుంచి మద్యాహ్నం 1గంట వరకు తంబళ్ళపల్లె నియోజకవర్గ పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారు. అదేరోజు మద్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మదనపల్లె నియోజకవర్గ పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారు.

## వైకాపా పట్టణ ఉపాధ్యక్షులుగా బాలగంగాధర్‌రెడ్డి

మదనపల్లె, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :



వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షులుగా మాజీ కౌన్సిలర్ బాలగంగాధర్‌రెడ్డిని నియామకం చేస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఆయన వైకాపా పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేశారు. కౌన్సిలర్‌గా ఉంటూ పార్టీ అభివృద్ధికి పనిచేయడం జరిగింది. ప్రస్తుతం ఆయన సతీమణి సరిత వైకాపా కౌన్సిలర్‌గా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను పట్టణ ఉపాధ్యక్షులుగా నియోమకం చేయడం పట్ల రాజంపేట ఎంపి మిథున్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి, మాజీ ఎంఎల్‌సి నరేష్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ జింకా చలపతి, డాక్టర్ అనీల్ కుమార్‌రెడిలకు అభినందనలు తెలిపారు.

## లింగ వివక్షత నిర్మూలనపై అవగాహన



తొండూరు ఏప్రిల్ 4 (ప్రభాతవార్త):
గ్రామంలో అంగన్వాడీ కేంద్రం నందు గర్భవతులు, పాలిచ్చు తల్లులకు, యుక్త వయస్సు అమ్మాయిలకు లింగ వివక్షత నిర్మూలన పై అవగాహన కార్యక్రమం హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడ పిల్లల శాతం మగ పిల్లల కంటే తగ్గిపోతుందటం విచారకరం. దంపతుల ఆలోచనలో మార్పు రావాలని అమ్మాయి అని స్కానింగ్ ద్వారా తెలుసుకొని అక్రమ గర్భ స్రావాలు చేయించడం చట్ట రీత్యా నేరం అని తెలిపారు. ఈ విధమైన చర్యలకు పాల్పడిన యెడల సమాజం లో ఆడ, మగ ల మధ్య అసమానతలు ఏర్పడతాయని కావున ఆడ అయిన మగ అయిన ఇద్దరు సమానమని, ఆడపిల్లలని చదివించిన యెడల ప్రయోజకులు అయి కుటుంబానికి మంచిపేరు తీసుకువస్తారని తెలిపారు. అందుకే ఆడ పిల్లని గౌరవిద్దాం, ఆడపిల్లని చదివిద్దాం, భేటీ బచావో. భేటీ పడా వో కార్యక్రమం ప్రాధాన్యత గురించి మరియు గర్భస్థ పూర్వ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం 1994 గురించి తెలియచేసారు ఈ చట్టం ప్రకారం మొదటి సారి భ్రూణ హత్యలకు పాల్పడిన వారికి, ప్రోత్సహించి వారికి 10వేల రూపాయల జరిమాన, 3 సంవత్సరాల జైలు శిక్ష రెండవ సారి అదే తప్పు చేసిన యెడల 50 వేల రూపాయల జరిమానా, 5 సంవత్సరాల జైలు శిక్ష విధించబడును. అబార్షన్ చేసిన వైద్యుడి వైద్య పట్టా పూర్తిగా రద్దు చేయబడునని తెలియ చేసారు, ఈవిధమైన చర్యలు పాల్పడే వారి సమాచారము సంబంధిత అధికారులకు తెలియచేయాలని, లేదా 104 కాల్ సెంటర్ ఫోన్ చేయాలని తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతారాని తెలిపారు. ఈ కార్యక్రమం ఈవోఆర్‌డి సాయి ప్రతాప్‌రెడ్డి, మహిళా పోలీసు ప్రవీణ, ఆరోగ్య కార్యకర్త శుక్రూ, అంగన్వాడీ సిబ్బంది సుజాత, తేజ రేవతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవకే అంకితం



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

పీలేరు ఏప్రిల్ 4 ప్రభాతవార్త :
కలికిరి మా కుటుంబం ప్రజాసేవకే అంకితమని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం కలికిరి జేఎన్టీయూ కళాశాలలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ తండ్రి నల్లారి అమర్నాథరెడ్డి మంత్రి హోదాలో మరణించే నాటికి తనకు 21 సంవత్సరాలని, అప్పట్లో తానే పోటీలో ఉండాల్సి రాగా వయస్సు లేదని తమ అన్నను బలవంతంగా రాజకీయాల్లోకి తీసుకొచ్చామన్నారు. అప్పట్లో చంద్రబాబు నాయుడు సహకారంతోనే జేఎన్టీయూ కళాశాల పూర్తి చేసి ప్రారంభించామనే ఆయన చెప్పుకొచ్చారు. భవిష్యత్తులో మదనపల్లె జిల్లా కాబోతుందని, ఈ క్రమంలో కలికిరి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలను యూనివర్సిటీగా మార్చాల్సిందిగా అసెంబ్లీలో గట్టిగా వినిపించానన్నారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముద్దనూరు, ఏప్రిల్ 04, ప్రభాతవార్త:
విద్యుత్ సబ్ స్టేషన్ నందు మరమ్మత్తులు కారణంగా శనివారం నాడు ముద్దనూరు మండలం అంతా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12,గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ముద్దనూరు ఏఈ రాజావర్మ తెలిపారు. అంతరాయాన్ని గమనించి మండల ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు.

## వైసీపీ మండల ప్రధాన కార్యదర్శిగా సిపి రమణ

రామసముద్రం ఏప్రిల్ 4 ప్రభాతవార్త



వైసీపీ పార్టీ అధ్యక్షులు వై యస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా లోని రామసముద్రం మండలానికి 28 మందితో కూడిన మండల కమిటీను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులను జారీచేసింది. శుక్రవారం వెలుపడిన ఉత్తర్వులలో ఉపాధ్యక్షులుగా ఎన్. కృష్ణప్ప. కె. వల్లప్ప. ప్రధానకార్యదర్శిలుగా సి. ఆర్ ఈశ్వర్ రెడ్డి,సి. బుడ్డారెడ్డి, ఎం. విజయ, కార్యదర్శులు గా బి. రమణారెడ్డి, వి. జబీ బాషా, టి. అంబరీష్, మున్వర్ బాషా, కె. నారాయణ స్వామి, సభ్యులుగా అమర్ నాథ్ రెడ్డి, ఎన్. గుణశేఖర్, రమణ, కేశవ, నాగరాజు, ప్రసాద్, హరీష్, సి హెచ్ మంజునాథ్, నవీన్ కుమార్, సోమశేఖర్ రెడ్డి, టి. శ్రీనివాసులు, బీకే. నరసింహులు, బి. నరేష్ రెడ్డి, టి. గుణశేఖర్, జి. పురుషోత్తం రెడ్డి, చంద్రశేఖర్ రావు, ఇ. విజయారెడ్డిలను నియమించింది.

## ఆలయ చోరీ ఘటనలో ఇరువురికి రిమాండ్

ముద్దనూరు ,ఏప్రిల్ 04, ప్రభాతవార్త:
మండలంలోని కొర్రపాడు గ్రామంలో బుధవారం మధ్యాహ్నం చెన్నకేశవ స్వామి ఆలయంలో దొంగతనానికి ప్రయత్నించి విఫలం చెంది పారిపోయిన ఇరువురు వ్యక్తులను శుక్రవారం ఎస్సై మైనుద్దీన్, తోటి సిబ్బంది మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామ సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణం మత్స్య కాలనీకి చెందిన షేక్ మస్తాన్ ను జమ్మలమడుగు కోర్టులో హాజరు పరిచి, మరొక వ్యక్తి మైనర్ బాలుడు కావడంతో కడప బాలల సంరక్షణ జైలుకు తరలించి రిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు.

## డిప్యూటీ డీఈవోపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు ఏప్రిల్ 4 ప్రభాతవార్త




విధులలో నిర్లక్షయం వహిస్తున్న ప్రొద్దుటూరు ఉప విద్యాశాఖ అధికారి పై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థి యువజన ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక డిప్యూటీ డిఈఓ కార్యాలయం ఎదురుగా విద్యార్థి యువజన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధులలో నిర్లక్ష్యం, ఉపాధ్యాయులను చులకన స్వభావంతో చూస్తున్నందుకు ప్రైవేటు విద్యాసంస్థల పట్ల చిన్నచూపు చూసినందుకు తక్షణమే ఆమెను విధులలో నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఏదైనా సమస్య చెప్పుకోవడానికి ఆఫీసుకు వస్తే పరిష్కరించకపోగా దుర్భాషలాడము చులకన స్వభావంతో చూడడం దుర్మార్గమైన చర్యన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి యువజన ప్రజాసంఘాల నాయకులు కత్తి ఓబులేసు, గడ్డం నరసింహులు ప్రతాపరెడ్డి జయన్న జయరాజు బయన్న, దాసు, శ్రావణ్, రవి,లక్ష్మయ్య పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ అడ్మిషన్లకు ప్రవేశం

రామసముద్రం,ఏప్రిల్4, ప్రభాతవార్త
ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ఏప్రిల్ ఏడవ తేది నుండి ప్రారంభమవుతాయని కళాశాల ప్రిన్సిపాల్ చిట్టిబాబు తెలియజేశారు. కళాశాలలో ఎంపిసి,బైపిసి, ఎంబైపిసి, ఎంఈసి, సిఈసి గ్రూపులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థులు హాల్ టికెట్‌తో కళాశాలలో ప్రవేశం పొందవచ్చునని, కళాశాలలో చేరిన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, బ్యాగ్స్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచితంగా అందించబడునని, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన సదుపాయం కలదన్నారు.

# బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు



ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయం

(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ఈ నెల 6 వ తేదీ నుండి 14వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. ఏప్రిల్ 5న సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించనున్నారు. శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలకు విశేషంగా విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టిటిడి విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఆలయంలో ప్రత్యేక క్యూలైన్లు, ఎండవేడిని తట్టుకునేలా చలువపందిళ్లు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో బారికేడ్లు ఏర్పాటుచేశారు. ఆలయ గోపురాలు, కల్యాణవేదిక, ఇతర ప్రాంతాల్లో పుష్పాలంకరణలు, రంగురంగుల విద్యుత్ దీపాలు, విద్యుత్ కటౌట్లతో శోభాయమానంగా అలంకరించారు. భక్తుల కోసం అన్నప్రసాద వితరణ కౌంటర్లు తదితర ఏర్పాట్లు చేశారు. 6వ తేదీన ధ్వజారోహణంతో శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 నుండి 10.15 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజారోహణం, రాత్రి 7 నుండి 9 గంటల వరకు శేష వాహనసేవ జరుగనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6న శ్రీ రామనవమి, 9న హనుమత్సేవ, 10న గరుడసేవ జరగనున్నాయి. 11న సాయంత్రం 6.30 నుండి రాత్రి 8.30 గంటల వరకు శ్రీ సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరుగనుంది. అనంతరం గజ వాహనసేవ నిర్వహిస్తారు. 12న రథోత్సవం నిర్వహిస్తారు. 14న ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. 15న సాయంత్రం 5.30 నుండి రాత్రి 9 గంటల వరకు పుష్పయాగం వైభవంగా నిర్వహిస్తారు. ప్రతిరోజూ ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవలు జరుగనున్నాయి. శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో శ్రీరామనవమి పర్వదినం, శ్రీ పోతన జయంతిని పురస్కరించుకుని టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో 6వ తేదీ సాయంత్రం 4 నుండి రాత్రి 7 గంటల వరకు పోతన భాగవతం అంశంపై కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. ఏప్రిల్ 7వ తేదీ రామాయణంలోని కాండలపై కవి సమ్మేళనం జరుగుతుంది.

**ఆలయ చరిత్ర :** ఒంటిమిట్ట ఈ కోదండ రామాలయానికి పురాతన, చారిత్రక ప్రాశస్త్యం ఉంది. ఒకే శిలపై సీతారామ లక్ష్మణ దేవతామూర్తులు ఉండడం వల్ల ఒంటిమిట్టను ఏకశిలానగరం అని కూడా అంటారు. పురాణాల ప్రకారం ఆలయ చరిత్ర ఇలా ఉంది. శ్రీమహావిష్ణువు త్రేతాయుగంలో శ్రీరామచంద్రునిగా అవతరించాడు. సీతాలక్ష్మణ సమేతుడై దండకారణ్యంలో సంచరిస్తుండగా సీతాదేవి దప్పిక తీర్చేందుకు భూమిలోనికి బాణం వేయగా నీరు బుగ్గ పుట్టింది. అదే ఒంటిమిట్ట రామతీర్థం అయింది. సీతాన్వేషణ కోసం జాంబవంతుడు సహకరించాడు. ఆ జాంబవంతుడు సేవించిన సీతాలక్ష్మణ సమేత శ్రీ రామచంద్రుడే ఒంటిమిట్ట గుడిలో కొలువై ఉన్నాడు.

**శాసనాల ప్రకారం :** ఈ ఆలయాన్ని మూడు దశల్లో నిర్మించారని, 14వ శతాబ్దంలో నిర్మాణం ప్రారంభమై 17వ శతాబ్దంలో పూర్తయిందని ఇక్కడున్న శాసనాల ద్వారా తెలుస్తోంది. ఉదయగిరిని పాలించిన కంపరాయలు ఈ ప్రాంతంలో ఒకసారి సంచరిస్తాడు. వేట మీద జీవనం సాగించే వంటడు, మిట్టడు ఇక్కడికొచ్చిన కంపరాయలకు, ఆయన పరివారానికి శ్రీరాముడు సృష్టించిన బుగ్గనీటితో దప్పిక తీరుస్తారు. వీరిరువురి కోరికపై కంపరాయలు ఆలయాన్ని నిర్మించి ఒంటిమిట్ట గ్రామాన్ని ఏర్పాటుచేస్తాడు. క్రీ.శ 1356లో బుక్కరాయలు ఈ ఆలయాన్ని ప్రారంభించాడు. ఆ తరువాత కాలంలో విజయనగరరాజులు, మట్లిరాజులు క్రమంగా గుడికి అంతరాళం, రంగమండపం, మహాప్రాంగణం, గోపురం, రథం నిర్మించారు. ఒంటిమిట్ట చుట్టుపక్కల గ్రామాల రాబడిని ఆలయ కైంకర్యాలకు వినియోగించారు. వావిలికొలను సుబ్బారావు భిక్షాటన చేసి విరాళాలు సేకరించి ఆలయానికి పూర్వ వైభవం తెచ్చారు.

**రాములవారిపై సాహిత్యం :** ఎందరో మహాకవులు తన సాహిత్యం ద్వారా శ్రీరామచంద్రుని కరుణకు పాత్రులయ్యారు. పోతన ఇక్కడే భాగవతాన్ని అనువదించినట్టు తెలుస్తోంది. అయ్యలరాజు తిప్పయ్య ఒంటిమిట్ట రఘువీర శతకం చెప్పారు. రామభద్రుడు రామాభ్యుదయం రచించారు. నల్లకాల్వ అయ్యప్ప ఒంటిమిట్ట రాముని వరం పొంది వరకవి అయ్యారు. ఉప్పు గొండూరు వేంకటకవి ఒంటిమిట్ట రశరథరామ శతకం చెప్పారు. వావిలికొలను సుబ్బారావు ఆంధ్రవాల్మీకి రామాయణాన్ని మందర వ్యాఖ్యతో రచించారు. తాళ్లపాక అన్నమయ్య రామునిపై పలు సంకీర్తనలు ఆలపించారు.

# వృత్తి అవకాశాలపై విజ్ఞాన సదస్సు



వృత్తి అవకాశాలపై విజ్ఞాన సదస్సు

అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త

అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో శుక్రవారం స్నాతకోత్సవం తరువాత వృత్తి అవకాశాలపై ( గేట్/ఐఈఎస్/ పిఎస్‌యు) సదస్సు జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ట్రిబుల్‌ఈ) విభాగం ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ విద్యార్థులలో వివిధ ప్రభుత్వ రంగ ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేశారు. ఈ ఉపన్యాసానికి ముఖ్య అతిథిగా ఏ సి ఈ ఇంజినీరింగ్ అకాడమీ, హైదరాబాద్‌కు చెందిన వి ఆర్ డిఎం కౌసిక్ అగస్త్యరాజ్ హాజరై, తన విశేష అనుభవాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. గేట్, ఐఈఎస్, పిఎస్‌యు వంటి పోటీ పరీక్షల ప్రాధాన్యత, తయారీ విధానాలు, సిద్ధతకు అవసరమైన వ్యూహాలు, మరియు మానసిక శక్తిని పెంపొందించుకునే మార్గాలు వంటి అంశాలను తన ప్రసంగంలో వివరించారు. విద్యార్థుల అకడమిక్, వృత్తి అభివృద్ధికి సహకరించే విధంగా విశ్వవిద్యాలయం తరచూ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ట్రిబుల్ ఈ విభాగాధిపతి డా. ఎం. పద్మ లలిత ఆధ్వర్యంలో నిర్వహించారు. రిజిస్ట్రార్ ఎన్. మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్ ఎస్.ఎం.వి. నారాయణ, వైస్‌చాన్సలర్ ఈ. సాయిబాబారెడ్డి పాల్గొన్నారు.



APSRTC హెవీ డ్రైవింగ్ స్కూల్ 24వ బ్యాచ్ పూర్తి అయింది. సర్టిఫికెట్లు Dpto పోలిమెర గోపాల్ రెడ్డి, మరియు డిపో మేనేజర్ దిల్లేశ్వరరావు. మరియు ట్రైనర్, SA జబ్బర్ చేతులు మీదుగా సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగినది. 25 వ బ్యాచ్ అడిమిషన్స్ జరుగుచున్నవి. హెవీ డ్రై వింగ్ నేర్చుకునుటకు ఆసక్తి కలవారు కాల్ చేయవలను. 9959225774 7382865145.

## డిడిఆర్‌సి సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించాలి

### జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్



రాయచోటి, ఏప్రిల్ 04 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు బీసీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో 8న నిర్వహించబోయే డిడిఆర్‌సి సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించాలని అధికారులను జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో 8న అన్నమయ్య జిల్లా ఇన్చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరగబోయే డిడిఆర్సి (డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ రివ్యూ కమిటీ) సమావేశంపై జిల్లా అధికారులతో జిల్లా సంయుక్త కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులందరూ వారి శాఖలకు సంబంధించిన పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలపై సిపిఓకి అందించిన సమగ్ర నివేదికలను క్లుప్తంగా సులభంగా అర్థం చేసుకునే విధంగా మార్పులు చేసి అందజేయాలన్నారు. వివిధ శాఖల నుంచి వచ్చిన నోట్సు్న సమీక్షించిన అనంతరం తయారుచేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ను జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులకు వివరించేందుకు అనుకూలంగా తయారు చేయాలని సిపిఓను ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రాధాన్యతా రంగాల లక్ష్యాలను అధిగమించాలి

కడప, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:

ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అన్ని ప్రాధాన్యతా రంగాలను మరింత పటిష్టం చేసి జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్ని రకాల ప్రాధాన్యతా రంగాలకు చెందిన జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా రంగాల్లో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలు, సాధించాల్సిన ప్రగతి.. తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ సంబందిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ వ్యవసాయ శాఖకు సంబంధించి జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో డివిజన్ల వారీగా టార్గెట్లు కేటాయించి సాగుబడి విస్తీర్ణాన్ని పెంచడంతో పాటు అధిక దిగుబడులను సాధించేలా యాజమాన్య పద్ధతులను రైతులు పాటించేలా అవగాహన పెంచాలన్నారు. ప్రధానంగా విత్తనాల ఉత్పత్తి, పంటల మార్పులు, మైక్రో న్యూట్రియన్స్‌పై రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. పూలు సాగుకు అనుకూలమైన తోటల పెంపకాన్ని చేపట్టేలా రైతులకు అవగాహన పెంచాలన్నారు. మార్కెట్ లక్ష్యాలకు అనుగుణంగా చీని, అరటి పంటల కొత్త రకాలను ప్రోత్సహిస్తూ సాగు చేసే విధంగా రైతులను సిద్ధం చేయాలన్నారు. అలాగే మండలాల్లో ప్రాసెసింగ్ యూనిట్లను స్థాపించేలా రైతుల్లో అవగాహన పెంచాన్నారు. ఎపిఎంఐపీ ద్వారా జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పశుసంవర్ధక శాఖను మరింత విస్తృతం చేస్తూ పాడి పరిశ్రమ, పౌల్ట్రీ, గొర్రెలు, మేకల పెంపకందార్లను ఆర్థికంగా ముందుకు నడిపే సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. మత్స్య శాఖకు సంబంధించి జిల్లాలోని అన్ని రిజర్వాయర్లు, నీటి వనరు ఉన్న ప్రాంతాల్లో చేపల ఉత్పత్తిని పెంపొందించాలన్నారు. ప్రాధాన్యత రంగాలకు చెందిన జిల్లా అధికారులు ఆయా రంగాలలో నిర్దేశించిన లక్ష్యాలను యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని సూచించారు. అలాగే వర్షాలకు దెబ్బతిన్న పంటల నష్టం పై రిపోర్ట్ అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ జీడి నాగేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డా. శారదా, ఉద్యాన శాఖ జిల్లా అధికారిని సుభాషిని, ఏపీఎంఐపి పీడీ వెంకటేశ్వర రెడ్డి, మార్కెటింగ్ శాఖ, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యలు పరిష్కరించడమే మంత్రి ధ్యేయం



లక్కిరెడ్డిపల్లి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలు పరిష్కరించడమే మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారి ధేయమని లక్కిరెడ్డిపల్లి మండల యువ నాయకుడు యనుముల మదన్ మోహన్ తెలిపారు. శుక్రవారం మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వివిధ గ్రామాల ప్రజల సమస్యలను తెలుసుకొని అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించడం జరిగిందిని తెలిపారు. ప్రజాసమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పెద్దపీట వస్తుందని గ్రామాభివృద్ధి చేయడమే ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ప్రస్తుత వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అనేక గ్రామాల్లో ఇప్పటికే త్రాగునీటి బోర్లు మంత్రి మండిపల్లి రాంపాల్‌రెడ్డి, మరియు అతని సోదరుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి సొంత నిధులతో వేపించారని ఇంకా కొన్ని గ్రామాలలో తాగునీటి సమస్య ఉన్నందున నీటి టాంకర్ల ద్వారా తాగు నీటిని సరఫరా చేయడం జరుగుతుంది అని తెలియజేశారు. గతంలో గ్రామాల అభివృద్ధి నోచుకోక ఎంతో వెనుకబడి ఉన్నాయిని కూటమి ప్రభుత్వం ఏర్పడిన 9 నెలల కాలంలోనే గ్రామాల్లో సిమెంట్ రోడ్డు చేసి ఆదర్శ గ్రామాల అభివృద్ధి చేసే కృషి చేయడం జరుగుతుంది యనుముల మదన్మోహన్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# వాట్సప్, ఇ-మెయిల్, ఇతర ఎలక్ట్రానిక్ పద్ధతుల్లో నోటీసులు పంపుట చెల్లదు

(సుప్రీం కోర్టు స్పష్టీకరణ)

బద్వేలు లీగల్, ఏప్రిల్ 04 ప్రభాతవార్త :

నేర శిక్షాస్మృతి లేదా భారతీయ నాగరిక సురక్ష సంహిత ప్రకారం నిందితులకు పోలీసు అధికారులు ఇవ్వవలసిన నోటీసులను వాట్సప్, ఇ-మెయిల్ లేదా ఇతర ఎలక్ట్రానిక్ పద్ధతులలో పంపరాదని సుప్రీం కోర్టు పేర్కొనింది. సిఆర్‌పిసి-1973 లోని సెక్షన్-41(ఎ) లేదా బిఎన్ఎస్ఎస్-2023 లోని సెక్షన్-35 ప్రకారం జారీ చేసే నోటీసులను చట్టం అనుమతించినట్లుగానే నిందితులకు అందజేయాలని, ఆ విధంగా ఆయా పోలీసు అధికారులను ఆదేశించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. సతేందర్ కుమార్ అంటిల్ కేసులో ధర్మాసనం జనవరి 21వ తేదీన ఈ ఆదేశాలను జారీ చేసింది. సిఆర్‌పిసి-1973 లోని సెక్షన్-41(ఎ) ప్రకారం నిందితులకు నోటీసులను వాట్సప్ ద్వారా పంపించినపుడు ఆ నిందితులు ధర్యాప్తు అధికారి సమక్షంలో హాజరుకాని సందర్భాలు ఉన్నాయనే విషయం కోర్టు దృష్టికి వచ్చింది. నిందితులకు నోటీసులను అందజేయడానికి సిఆర్‌పిసి/బిఎన్ఎస్ఎస్ నిర్దేశించిన, గుర్తించిన విధానం ఉందని, వాట్సప్ లేదా ఇతర ఎలక్ట్రానిక్ పద్ధతులలో నోటీసులను పంపించడం ఆ విధానానికి ప్రత్యామ్నాయం కాదని సుప్రీం కోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది.

# ప్రతి విద్యార్థికి ఎన్‌సిసి అవసరం



మిట్స్‌లో ఎన్‌సిసి విద్యార్థులు గౌరవ వందనం స్వీకరిస్తున్న దృశ్యం

కురబలకోట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :

ఆధునిక విద్యావ్యవస్థలో ప్రతి విద్యార్థికి ఎన్‌సిసి అవసరమని ముఖ్యఅతిథి గ్రూప్ క్యాప్టన్ ఆర్‌జె.ఆత్రే కమాండింగ్ ఆఫీసర్, ఎస్‌కూ, మాస్టర్ వాలంట్ ఆఫీసర్ ఎల్.సంతోష్‌కుమార్‌లు అన్నారు. శుక్రవారం మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎయిర్‌వెన్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జె.ఆత్రే మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్దయూనిఫామ్ యువజన దళంగా ఎన్‌సిసి అభివృద్ధి చెందిందని రేపటి ఫౌరుల్లో దేశభక్తి, సేవాభావం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో ఎన్‌సిసి ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. ఎన్‌సిసి విద్యార్థులు వారానికి నాలుగు గంటల చొప్పున సమయం కేటాయించాలన్నారు. ఎన్‌సిసి ధృవపత్రాలను ఉన్నత చదువులకు ఉపయోగపడుతాయన్నారు. కళాశాలలో మెకానికల్, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో ఉపయోగపడే పరికరాలను వారు తనిఖీ చేశారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ సి.యువరాజ్, ఎన్‌సిసి అధికారి నవీన్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

# హనుమంత వాహనంపై పట్టాభిరాముడి విహారం



వాల్మీకిపురం, ఏప్రిల్ 04 ప్రభాతవార్త:

వెయ్యేళ్లకు పైగా చరిత్ర కలిగిన వాల్మీకిక్షేత్రంలోని శ్రీ పట్టాభిరాముడి విశ్వావసు నామ సంవత్సర సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు శుక్రవారం సీతాసమేత పట్టాభిరాముడు తన ప్రియభక్తుడైన హనుమంతునిపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, పంచాంగ శ్రవణం, కొలువు, అర్చన అనంతరం ఉదయం 8గంటలకు స్వామివారిని ముత్యపు పందిరి వాహనంపై పురవీధుల్లో విహరించారు. ఉదయం 10గంటల నుంచి ఉత్సవర్లకు స్నపన తిరుమంజన సేవ నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఊంజల మండపంలో ఊంజల్ సేవ నయనానందకరంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి డిప్యూటీ ఇఒ వరలక్ష్మీ, ఎఇఒ గోపినాథ్, సూపరింటెండెంట్ మునిబాలకుమార్, ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, సిబ్బంది నాగరాజ, అర్చకులు క్రిష్ణరాజు భట్టర్, క్రిష్ణప్రసాద్ భట్టర్, భక్తులు పాల్గొన్నారు.

# వివాదాస్పద భూమిని పరిశీలన



రామసముద్రం ఏప్రిల్ 4 ప్రభాతవార్త

మండలం కెసి పల్లెకు చెందిన వివాదాస్పద భూమిని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ శుక్రవారం పరిశీలించారు. వివాదాస్పద భూమికి సంబంధించి సర్వే నంబర్ 206/3 లో 1.16 సెంట్లు, సర్వే నంబర్ 207/2కు సంబంధించి 26 సెంట్ల భూమికి సంబంధించి రామమూర్తి,దొడ్డమ్మ వెంకట రమణ రెడ్డి మధ్య వివాదం నెలకొంది.ఇందుకు సంబంధించి జె సీ కోర్టులో కేసు నడుస్తోంది,వీటి పూర్తి వివరాల పరిశీలనకు వచ్చినట్లు సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ పేర్కొన్నారు.ఈసందర్భంగా అరికేల పంచాయతీ గోసువారి పల్లెలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని,ఇందుకు సంబంధించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు సబ్ కలెక్టర్ ను కోరారు. కార్యక్రమంలో తహశీలదార్ నిర్మలాదేవి, రెవిన్యూ సిబ్బంది ,గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం



దువ్వూరు, ఏప్రిల్ 04, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వే ప్రాజెక్టుతో రైతులకు ఉన్న భూ సమస్యలు పరిష్కారం అవుతాయని మండల తహసీల్దార్ అక్బర్ బాష అన్నారు. మండల పరిధిలోని పెద్ద జొన్నవరం గ్రామంలో శుక్రవారం రెండవ విడత రీ సర్వే ప్రాజెక్టు కింద ఎంపికైన పెద్ద జొన్నవరం గ్రామంలో రీ సర్వేపై రైతులకు అవగాహణ ర్యాలీ నిర్వహించి వారితో మాట్లాడారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే చేసే సమయంలో వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు ప్రతి రైతుకు తెలియజేయాలని రైతు ఉన్న సమయంలోనే రీ సర్వే పూర్తి చేయాలన్నారు. రైతుల సమస్యను తెలుసుకొని అక్కడే పరిష్కారం అయ్యే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ కరీముల్లా, మండల సర్వేయర్ పద్మావతి, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

# పోటీ ప్రపంచంలో ఉన్నతస్థాయికి ఎదగాలి




కార్యక్రమంలో పాల్గొన్న దృశ్యం

కురబలకోట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :

పోటీ ప్రపంచంలో విశ్వం కళాశాల విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి, సమాజాభివృద్ధికి కృషి చేయాలని విశ్వం కళాశాల ఛైర్మెన్ ఎం.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం విశ్వం ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్, ఎంబిఏ విద్యార్థులకు వీడ్కోలు, ఆడియోస్ 2కె-25కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చుతూ గురువుల ప్రతిష్టను నిలపాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని తమ కళాశాల యాజమాన్యం కృషి చేస్తొందన్నారు. ఈ సందర్భంగా తెలుగుసినీ పరిశ్రమకు చెందిన గాయకులు లాస్యప్రియ, సంపత్, శిరీష, మ్యూజీషియన్ అండ్ మెంటాలిస్టు రామ్ అఖిల్‌ల అద్భుత గాత్రంతో విద్యార్థులు, అధ్యాపకులను అలరించారు. మ్యూజిషియన్ రామ్‌అఖిల్ తన అబ్బుత మాయాజాల ప్రదర్శనతో అందరిని అబ్బురపరిచారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు మెడల్స్, ప్రశాంసాపత్రాలను ఛైర్మెన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఓడిలు, డీన్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో విద్యార్థినిలపై వరుస లైంగిక వేధింపులు

- కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్

జమ్మలమడుగు, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:

ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థినిలపై వరుస లైంగిక వేధింపులు జరుగుతున్నాయని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఆర్ఎస్ఓ) డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లిటిల్ ఫ్లవర్ స్కూలు, ఏవీఆర్ స్కూళ్ల గుర్తింపు రద్దు చేయాలని తెలిపారు. అనంతరం రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కార్యదర్శి లింగమయ్య మాట్లాడుతూ బద్వేలు పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల్లో ఒక సంఘటన మరువకముందే మరో సంఘటన జరగడం విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యమేనని విమర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి జీఎస్టీ రూపంలో లక్షలు ఫీజులు కట్టించుకుంటూ అవినీతి అక్రమాలకు పాల్పడుతూ విద్యార్థు లకు ఎటువంటి ఫిజికల్ ఎడ్యుకేషన్ కల్పించకుండా రకరకాల క్లాసుల పేరుతో గోడలకే పరిమితం చేస్తున్నారన్నారు. చదువులు చెప్పాల్సిన ఉపాధ్యాయులు విద్యార్థినిల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం దుర్మార్గమన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా అధికారులు స్పందించి మండల విద్యాశాఖాధికారి ఎంఈవోను సస్పెండ్ చేసి విద్యార్థులను వేధింపులకు గురి చేసిన వారిపై పోక్సో కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

# లబో దిబోమంటున్న రైతన్నలు

పోరుమామిళ్ల రూరల్, ఏప్రిల్ 4ప్రభాతవార్త:



కురిసిన అకాల వడగండ్లు గాలులతో కూడిన వర్షాలకు వందలాది ఎకరాలలో అరటి తోటలు నేలమట్టమయ్యాయి. వివరాలలోకి వెళితే కడప జిల్లా అవధూత కాశినాయన మండలంలోని సావిశెట్టిపల్లి గ్రామంలో రైతులు సుమారు వెయ్యి ఎకరాలు అరటి తోటలు సాగు చేశారు గురువారం రాత్రి కురిసిన వర్షాలకు చేతికొచ్చిన పంట పూర్తిగా నేలమట్టమయ్యాయి దీంతో ఆ గ్రామంలోని రైతులు లబోదిబో అంటున్నారు. కోతకు వచ్చిన ఈ దిశలో పంట పూర్తిగా నేలపాలు కావడం తో రైతుల బాధలు వర్ణనాతీతం చంద్ర ఓబుల రెడ్డి అనే ఓ రైతుకంగా 14 ఎకరాల లో అరటి పంటను సాగు చేసి సుమారు 20 లక్షల పైగా పెట్టుబడి పెట్టాడని ఇప్పుడు పంట పూర్తిగా నేలపాలు అయిందని ఆ రైతు గోడును వెళ్ళబోసుకున్నాడు రెండు రోజులు వర్షాలు రాకుండా ఉండి ఉంటే తను పెట్టిన పెట్టుబడిన వచ్చేదని ఇప్పుడు ఏమి చేయాలని అప్పులు చేసి సాగు చేసిన పంట చేతికి రాక నేలపాలు కావడంతో ఆ రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీరా చూస్తే నోటికి వచ్చిన ఈ పంట నేడో రేపో కోతలు కోసి చేసిన అప్పులు తీర్చుకోవచ్చని ఆనందంగా ఉన్న ఆ రైతు రాత్రి కురిసిన అకాల వర్షాల కారణంగా పూర్తిగా నష్టపోయారు. ఈ పంట నష్టపోయిన అటు ప్రభుత్వ అధికారులు ఇటు పాలకపక్ష నాయకులు స్పందించి ఆదుకోవాలని రైతుల విజ్ఞప్తి చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పం దించి నష్టపోయిన రైతులను గుర్తించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు. చేసిన అప్పులు తీర్చలేక చేతికి వచ్చిన పంటలు నేల పగలు కావడంతో మాకు ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఉపాధి హామీ పనులు తనిఖీ

దువ్వూరు, ఏప్రిల్ 04, ప్రభాతవార్త:

మండల పరిధిలోని వివిధ గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఉపాధి హామీ ఏపీడీ సుబ్బారెడ్డి, ఎంపీడీఓ రామకృష్ణలు తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా నేలటూరు, ఐ.బయనపల్లె గ్రామాల్లో నీటి తొట్టులను నిర్మించేందుకు ఏర్పాటు చేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ పశువులకు అందుబాటులో ఉండే విధంగా నీటి వసతికి దగ్గరగా ఏన్న ప్రాంతాల్లో నీటి తొట్టులను నిర్మించాలన్నారు. మండలంలో 13గ్రామాలకు నీటి తొట్టులు మంజూరు అయ్యాయని, ఒక్కొక్క దానికి 30వేలు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. అలాగే అక్కడే పనిచేస్తున్న కూలీలకు సంబంధించి మస్టర్లను తనిఖీ చేశారు. మౌళిక వసతులు ఏర్పాటుచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



# స్వామివారికి ప్రత్యేక పూజలు

రామసముద్రంఏప్రిల్4 ప్రభాతవార్త

మండల కేంద్రంలో అతిపురాతన శ్రీలక్ష్మిజనార్ధన స్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు కులశేఖర్ బటర్ శుక్రవారం శ్రీలక్ష్మి జనార్ధన స్వామి వారిని పలు రకాల పుష్పాలతో అలంకరణ చేసి, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. చుట్టుపక్కల గ్రామాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.స్వామిని దర్శించుకున్న భక్తులకు ఆలయ అర్చకులు కులశేఖర్ బటర్ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# తులసి రెడ్డిని కలిసిన శివమోహన్ రెడ్డి

వేంపల్లి: ఏప్రిల్ 04 (ప్రభాత వార్త):

జమ్మలమడుగు అసెంబ్లీ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త శివామోహన్ రెడ్డి శుక్రవారం వేంపల్లి లో రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్. తులసి రెడ్డిని కలిశారు. త్వరలో జమ్మలమడుగు నియోజక వర్గం లో వివిధ సమస్యల మీద,ప్రత్యేకించి ఉక్కు కర్మాగారానికి సంబంధించి కాంగ్రెస్ పార్టీ తరపున పాద యాత్ర చేపడతామని,అందుకు ముఖ్య అతిథిగా రావాలని తులసి రెడ్డిని ఆహ్వానించారు. శివమొహన్ రెడ్డితో పాటు నియోజక వర్గ కాంగ్రెస్ నాయకులు శ్రీయుతులు శివకుమార్,వరప్రసాద్,రెడ్డి,శ్రీనాథ్ తులసి రెడ్డిని కలిశారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు ధ్రువకుమార్ రెడ్డి, సుబ్రమణ్యం, అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న, రామాంజనేయ రెడ్డి, బద్రి, రమణ, నాగరాజు, మదార్,చందూ తదితరులు పాల్గొన్నారు.